

ముగిసిన ప్రత్యేకోత్సవాలు

కాణిపాకం, న్యూస్‌టుడే: ప్రత్యేకోత్సవాల్లో భాగంగా చివరి రోజైన శుక్రవారం రాత్రి సిద్ధిబుద్ధి సమేతుడైన వరసిద్ధి వినాయకస్వామివారు పవిత్ర పుష్కరిణిలో తెప్పలపై విహరిస్తూ భక్తులను అలరించారు. ముందుగా మిరుమిట్లు గొలిపే విద్యుత్తు దీపాలంకరణ, పుష్పాలతో రూపొందించిన తెప్పపై ఉత్సవమూర్తులను అధిష్ఠింపజేశారు. పుష్కరిణిలో బెల్లం, చిల్లర నాణేలు, కర్పూర హారతులను భక్తులు సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు. ఉత్సవమూర్తులను పురవీధుల్లో ఊరేగించారు. స్వామివారి ఆలయంలో 7వ తేదీ నుంచి శుక్రవారం వరకు 21 రోజులపాటు జరిగిన బ్రహ్మోత్సవాలు, ప్రత్యేకోత్సవాలు తెప్పోత్సవంతో ముగిశాయి. పూతలపట్టు ఎమ్మెల్యే కలికిరి మురళీమోహన్, ఈవో పి.గురుప్రసాద్, కాణిపాకం సర్పంచి కె.శాంతిసాగర్‌రెడ్డి, మాజీ ఛైర్మన్ మణినాయుడు పాల్గొన్నారు.

ఈనాడు చిత్తూరు

శనివారం సెప్టెంబరు 28, 2024

మెప్మా.. మీ పాత్రెంతో చెప్మా!

- తిరుపతి లోక్‌సభ ఉప ఎన్నిక, కుప్పం ఎన్నికల్లో వైకాపా నేతలకు సాయం
- ఆలస్యంగా వెలుగు చూస్తున్న అక్రమాలు

తిరుపతి (నగరపాలిక), న్యూస్‌టుడే: కూటమి ప్రభుత్వం అధికారంలోకి రాగానే మెప్మా అరాచకాలు ఒక్కొక్కటిగా వెలుగుచూస్తున్నాయి. పట్టణాలు, నగరాల్లో పేదల ఆర్థికాభివృద్ధికి చేదోడువాదోడుగా ఉండాల్సిన మెప్మా ఉద్యోగులు రాజకీయ నాయకుల కుట్రలో భాగస్వాములయ్యారు. తిరుపతి లోక్‌సభ స్థానం ఉప ఎన్నిక, కుప్పం పురపాలక ఎన్నికల్లో దొంగ ఓటర్ల జాబితా రూపకల్పన, ఫొటోల మార్ఫింగ్ వ్యవహారంలో మెప్మా కీలక పాత్ర పోషించినట్లు తెలుస్తోంది. తమ తప్పులు బయట పడతాయని సిఫార్సులు పొంది బదిలీల్ని నిలుపుకొంటున్న తరుణంలో ఈ విషయాలు బయటపడుతున్నాయి.



కుప్పంలో బెదిరించి, ప్రలోభపెట్టి

కుప్పం పురపాలిక ఎన్నికలను అప్పటి మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి ప్రతిష్ఠాత్మకంగా తీసుకున్నారు. వైకాపా నేతలంతా కుప్పంలో తిష్ఠ వేసి అనుకూలమైన అధికారులను నియమించుకున్నారు. ఈ ఎన్నికల్లో తెర వెనుక కుట్రదారుల్లో మెప్మా ఉద్యోగులు ఉన్నట్లు ఇటీవల వెలుగులోకి వచ్చింది. ఎన్నికలకు ముందు 12 రోజుల పాటు తిరుపతి, చిత్తూరు జిల్లాలకు చెందిన 90 శాతం మంది ఉద్యోగులకు కుప్పం ఎన్నికల విధులు కేటాయించారు. స్థానిక వైకాపా నేతల పర్యవేక్షణలో కుప్పంలో ప్రతి వార్డులో తిరిగి మహిళా సంఘాల సభ్యుల్ని బెదిరించారు.. ప్రలోభాలకు గురిచేశారు. ఎన్నికల సమయంలో కుప్పం మహిళా సంఘాలు డీఆర్‌డీఏ పరిధిలో పని చేస్తుండగా.. డీఆర్‌డీఏ అధికారులు సైతం కుప్పంలో తిష్ఠ వేశారు. ఎన్నికల తరువాతే కుప్పంలోని మహిళా సంఘాలు డ్వాక్రా నుంచి మెప్మాలోకి చేరాయి.

శిబిరాల నిర్వహణ.. బస్సుల్లో తరలింపు

తిరుపతి లోక్‌సభ ఉప ఎన్నికకు ముందు తిరుపతి, చంద్రగిరి, పుంగనూరు, పలమనేరు, శ్రీకాళహస్తిలో మెప్మా సంఘాల సభ్యుల వివరాల్ని సేకరించారు. తిరుపతి సమీపంలోని తనపల్లె వద్ద ఉన్న ఓ కల్యాణ మండపంలో మెప్మా అధికారులు ఇందుకోసం ప్రత్యేక శిబిరాన్ని ఏర్పాటు చేశారు. ఎన్నికల సమయంలో వారిని తిరుపతిలోని పోలింగ్ కేంద్రాలకు బస్సుల్లో తరలించారు.

సెలవు పెట్టి అనధికారిక విధులు

తిరుపతి ఉప ఎన్నిక, కుప్పం పురపాలిక ఎన్నికల సమయంలో సీఎంఎం, టీఎంఎం, సీవో, మెప్మా పథక సంచాలకుల కార్యాలయంలోని టీఈ తదితర హోదాల్లో పనిచేసే ఉద్యోగుల్లో 90 శాతం మంది వైకాపా కార్యకర్తల అవతారం ఎత్తారు. 12 రోజుల పాటు సెలవుపై వెళ్తున్నట్లు లేఖలు రాసి మెప్మా పీడీ కార్యాలయానికి సమర్పించి అనధికారిక విధులకు హాజరయ్యారు. విధులు పూర్తయ్యాక నెల రోజులు ఎటువంటి వివాదం లేకపోవడంతో హాజరు పట్టికలో సంతకాలు చేసి పూర్తి జీతాలు తీసుకున్నట్లు సమాచారం. కుప్పం ఎన్నికల కోసం వెళ్లిన ఉద్యోగుల వివరాలు కనుక్కొంటాం. హాజరుపై విచారిస్తామని మెప్మా పీడీ రాధమ్మ తెలిపారు.

'ద్రవిడ'లో మైనింగ్ మాఫియాపై చర్యలేవి?

- వైకాపా హయాంలో ఇష్టారాజ్యంగా తవ్వకాలు
- కూటమి ప్రభుత్వం విచారణ చేయాలని పెరుగుతోన్న డిమాండ్



ఈనాడు, చిత్తూరు: ఐదేళ్ల వైకాపా పాలనలో ఆ పార్టీ నాయకులు ద్రవిడ విశ్వవిద్యాలయాన్ని అక్రమ మైనింగ్‌కు అడ్డాగా మార్చారు. ప్రస్తుత ముఖ్యమంత్రి, నాటి ప్రతిపక్ష నేత చంద్రబాబు ప్రభుత్వానికి లేఖ రాసినా ఎటువంటి చలనం లేదు. తెదేపా శ్రేణులు న్యాయ పోరాటానికి సమాయత్తమైన తర్వాత అధికారులు కదిలి కార్యకలాపాలు నిలిపివేయించారు. ఈ అంశంపై కూటమి ప్రభుత్వం విచారణ చేపట్టి బాధ్యులపై చర్యలు తీసుకుంటే భవిష్యత్తులో ఎవరూ ఇటువైపు కన్నెత్తి చూడరు.

ద్రవిడ భాష, సంస్కృతి పరిరక్షణే ధ్యేయంగా ద్రావిడ కూడలి కుప్పం నియోజకవర్గంలో ద్రవిడ విశ్వవిద్యాలయం నెలకొల్పారు. ఎన్టీఆర్ ఆలోచన మేరకు చంద్రబాబు 1997లో వర్సిటీని స్థాపించారు. అప్పట్లో విశ్వవిద్యాలయానికి సుమారు 1,100 ఎకరాలు కేటాయించారు. ఇందులో కొంతమేరే భవనాలు, తరగతి గదులున్నాయి. చాలా ప్రాంతం ఖాళీగానే ఉంది. అందులో కొంతవరకు గ్రానైట్ నిక్షేపాలున్నాయి.

గేట్లు మూసేస్తే.. దౌర్జన్యానికి దిగి

2019లో కొంతకాలం వర్సిటీ వీసీగా ఆచార్య సుధాకర్ ఉన్నారు. గ్రానైట్ దందాపై ఆయన కన్నెర్ర చేసి రాత్రి సమయంలో భారీ వాహనాలు రాకుండా గేట్లు మూసేశారు. దీంతో వైకాపా శ్రేణులు ప్రాంగణంలోకి వచ్చి దౌర్జన్యానికి దిగారు. చివరకు పంతం నెగ్గించుకుని వాహనాలు వచ్చేందుకు ఆటంకాలు లేకుండా చూసుకున్నారు. మూడేళ్లపాటు 15 మంది నిరాటంకంగా తవ్వకాలు చేశారు. దీనిపై గనులు, రెవెన్యూ శాఖ అధికారులకు తెలిసినా పట్టించుకోలేదు.

ప్రతినెలా ముట్టజెబితేనే..

వైకాపా అధికారంలోకి వచ్చిన వెంటనే ఆ పార్టీ నాయకులు, కొందరు వ్యాపారుల కన్ను వీటిపై పడింది. నియోజకవర్గంలోని కీలక ప్రజాప్రతినిధి, మరికొందరు నేతలకు ప్రతినెలా రూ.లక్ష నుంచి రూ.3 లక్షలు ముట్టజెప్పి అక్రమ తవ్వకాలకు దిగారు.


కప్పం కట్టకుంటే దాడులే..

గ్రానైట్ అక్రమంగా తవ్వి తరలించే వ్యక్తులు నాయక గణానికి డబ్బులు ఇవ్వకుంటే మాత్రం అధికారులు రంగంలోకి దిగారు. దాడులంటూ బెదిరించి దారిలోకి తెచ్చుకున్నారు. గ్రానైట్ రాళ్లు అత్యధికంగా తమిళనాడు, కొంతవరకు కర్ణాటకకు తరలించారు. అనధికారికంగా నిర్వహిస్తోన్న క్వారీలతో విద్యార్థులకు ఇబ్బంది కలుగుతోందని.. పర్యావరణానికి నష్టం కలుగుతోందని 2021లో నాటి వీసీ ఆచార్య తుమ్మల రామకృష్ణ గనుల శాఖ అధికారులకు లేఖ రాశారు. చివరకు చంద్రబాబు రంగంలోకి దిగడం, తెదేపా శ్రేణులు ఆందోళనకు సిద్ధం కావడంతో మైనింగ్‌కు అడ్డుకట్ట పడింది.

వైకాపా దోపిడీకి సాక్ష్యంగా..


వైకాపా హయాంలో కనిపించిన కొండలు.. గుట్టలు.. చెరువుల్లో మట్టిని అక్రమంగా తవ్వేశారు. అప్పట్లో ప్రకృతి వనరుల నిలువు దోపిడీకి సాక్ష్యంగా ఈ స్తంభం నిలుస్తోంది. బంగారుపాళ్యం మండలం నుంచి అరగొండ వెళ్లే మార్గంలో వజ్రాలపురం-బొమ్మయ్యపల్లి గ్రామాల మధ్య ఏరులో తవ్వకాలు చేపట్టారు. స్తంభం ఉన్న ప్రాంతాన్ని ఇలా వదిలేశారు. ప్రస్తుతం ఇది ప్రమాదకరంగా మారింది.

- ఈనాడు, చిత్తూరు



శ్రీవారి బంగారు, మహారథం ట్రయల్ రన్

తిరుమల, న్యూస్‌టుడే: శ్రీవారి బ్రహ్మోత్సవాల నేపథ్యంలో స్వామివారి బంగారు రథం, మహారథానికి ట్రయల్ రన్ నిర్వహించారు. భక్తులు, ఉద్యోగులు కొంత దూరం లాగగా ఇంజినీరింగ్, తితిదే అధికారులు పరిశీలించారు. ముందస్తు జాగ్రత్త చర్యల్లో భాగంగా రథాలను పరిశీలించినట్లు అధికారులు తెలిపారు.



మహారథాన్ని లాగుతున్న భక్తులు, ఉద్యోగులు

మొక్క పట్టుకుంటే.. ఆకు రాలుతోంది

జిల్లాలో లోటు వర్షపాతం వేరుసెనగ రైతులకు శరాఘాతంగా మారింది. కాయ ఊరే సమయంలో నీటి తడులు అందక దిగుబడులు పడిపోతున్నాయి. బంగారుపాళ్యం మండల పరిధిలో చాలా గ్రామాల్లో సమస్య అధికంగా ఉంది. వర్షంపై ఆధారపడి వేసిన పంటలు అన్ని ఇలా ఎండిపోవటంతో రైతులు తీవ్ర ఆందోళన చెందుతున్నారు. కనీసం పశువుల మేతకు ఉపయోగిద్దామని వాటిని తొలగించేందుకు వెళితే మొక్క పట్టుకోగానే ఆకులన్నీ రాలి నేలపాలవుతున్నాయి. చేసేది లేక వీటిని పొలాల్లోనే వదిలేస్తున్నారు రైతులు. కరవు మండలంగా ప్రకటించాలని రైతులు కోరుతున్నారు.

- ఈనాడు, చిత్తూరు. న్యూస్‌టుడే: బంగారుపాళ్యం





మాట్లాడుతున్న ఎంపీ దగ్గుమళ్ల ప్రసాద్‌రావు, పక్కన జడ్పీ ఛైర్మన్, కలెక్టర్ సుమిత్‌కుమార్, ఎమ్మెల్యేలు

మీరే రాజు, మంత్రిలా వ్యవహరిస్తారా..?

- సిఫార్సులు ఖాతరు చేయరా
- దిశలో డీఈవోపై ఎమ్మెల్యేల ఆగ్రహం

చిత్తూరు జడ్పీ, న్యూస్‌టుడే: 'విద్యాశాఖలో మీరే రాజు, మీరే మంత్రిలా వ్యవహరిస్తున్నారు.. ఎమ్మెల్యేలైన మేం సిఫార్సు లేఖలు ఇస్తే చెత్తబుట్టలో వేస్తారా.. ఇదేనా మీ పద్ధతి' అంటూ పూతలపట్టు, గంగాధరనెల్లూరు శాసనసభ్యులు మురళీమోహన్, థామస్.. డీఈవో దేవరాజుపై ఆగ్రహం వ్యక్తం చేశారు. జిల్లా అభివృద్ధి సమన్వయ, పర్యవేక్షక కమిటీ (దిశ) ఛైర్మన్, చిత్తూరు ఎంపీ దగ్గుమళ్ల ప్రసాద్‌రావు అధ్యక్షతన శుక్రవారం జరిగిన సమావేశంలో డీఈవో తీరుపై ప్రజాప్రతినిధులు మండిపడ్డారు. 'ఎన్నికైన వారు ప్రజాసేవకులుగా పనిచేస్తారు, వారికి గౌరవం ఇవ్వడం అధికారిగా మీ బాధ్యత కదా' అని ప్రశ్నించారు. విద్యాశాఖపై త్వరలో సమీక్షించాలని కలెక్టర్ సుమిత్‌కుమార్‌ను ఎమ్మెల్యే మురళీమోహన్ కోరారు. ఎంపీ మాట్లాడుతూ కేంద్ర అభివృద్ధి, సంక్షేమ పథకాలపై మూడు నెలలకోసారి సమీక్షిస్తామన్నారు. నియోజకవర్గాలకు కేటాయించిన నిధులను గ్రామాలాభివృద్ధికి వినియోగించాలని స్పష్టం చేశారు. సీహెచ్‌సీలు, పీహెచ్‌సీల్లో వైద్యులు, వైద్య పరికరాల కొరత, భవనాల కోసం ఎమ్మెల్యేలతో కలిసి వైద్యశాఖ మంత్రి సత్యకుమార్‌కు నివేదించనున్నట్లు చెప్పారు. ఎమ్మెల్యే మురళీమోహన్ మాట్లాడుతూ చిత్తూరు-బెంగళూరు జాతీయ రహదారిపై మొగిలి ఘాట్‌లో ఏడాదిలో 375 మంది మృతి బాధాకరమని, ఎన్‌హెచ్ అధికారులు నివారణకు ఏ చర్యలు తీసుకున్నారని ప్రశ్నించారు. కలెక్టర్ సుమిత్‌కుమార్ మాట్లాడుతూ 14, 15వ ఆర్థిక సంఘం నిధులు వినియోగించి పంచాయతీల్లో వీధి దీపాలు, రోడ్లు, పారిశుద్ధ్యం, ఇతర మౌలిక సదుపాయాల కల్పన జరగాలన్నారు. చిత్తూరు ఎమ్మెల్యే గురజాల జగన్మోహన్ మాట్లాడుతూ చిత్తూరు, నగరిలోని టిడ్కో గృహాలను లబ్ధిదారులకు అందజేయాలన్నారు. జడ్పీ సీఈవో రవికుమార్‌నాయుడు, నగర మేయరు అముద పాల్గొన్నారు.

దివ్యాంగ విద్యార్థులకు నేరుగా లబ్ధి

- వ్యక్తిగత ఖాతాలో పింఛన్ నగదు జమకు ప్రభుత్వ నిర్ణయం
- ఉమ్మడి జిల్లాలో 18 వేల మందికి ప్రయోజనం



పుత్తూరు, న్యూస్‌టుడే: ప్రభుత్వం అర్హులకు సామాజిక భద్రత పింఛన్లు అందిస్తోంది. వైకల్యం 45 శాతం పైబడిన వారందరికీ రూ.6 వేల నుంచి రూ.15 వేల వరకు సాయం అందుతోంది. జిల్లాలో నివాస ప్రాంతాలకు దూరంగా ఎంతో మంది విద్యార్థులు వసతి గృహాలు, గురుకులాల్లో చదువుతున్నారు. పుత్తూరు, చిత్తూరు, పలమనేరు, కుప్పం, పుంగనూరు, నగరి, తిరుపతి, శ్రీకాళహస్తి పట్టణాల్లో బధిర పాఠశాలలున్నాయి. అక్కడ వేలాది మంది పలు మండలాల నుంచి వచ్చి చదువుకుంటున్నారు. వీరంతా ప్రతినెలా స్వగ్రామాలకు వెళ్లి పింఛన్లు అందుకోవాల్సిందే. ఈ కష్టం నుంచి వారిని గట్టెక్కించేందుకు కూటమి ప్రభుత్వం నిర్ణయం తీసుకోవడంతో ఉమ్మడి జిల్లాలో 18 వేల మందికి ప్రయోజనం చేకూరనుంది.

ప్రభుత్వం నెల మొదటి రోజే పింఛను అందిస్తోంది. దీంతో దివ్యాంగ విద్యార్థులు ముందు రోజే వారి స్వస్థలాలకు రావాల్సి వస్తోంది. చాలా మంది ఒంటరిగా ప్రయాణం చేయలేకపోవడంతో తల్లిదండ్రులు, బంధువులు, సోదరులు వెళ్లి తీసుకురావాల్సిన పరిస్థితి. దీంతో రవాణా ఛార్జీల భారం వారిపై పడుతోంది. దీనికి తోడు పాఠశాలలకు వెళ్లేందుకు మరో రోజు ఇలా.. హాజరు కోల్పోతున్నారు. ఇది వారి విద్యాభ్యాసంపై ప్రభావం చూపుతోంది.

పాఠ్యాంశాల బాధ తీరుతుంది..



వెదురుకుప్పం మండలం మాంబేడు గ్రామానికి చెందిన ఆదినారాయణ కుమారుడు నరసింహులు. పుత్తూరులోని బధిర పాఠశాలలో పది చదువుతున్నాడు. సామాజికి భద్రత పెన్షన్ కోసం ప్రతి నెలా గ్రామానికి వెళ్తుండడంతో మూడు రోజులు పాటు తరగతులు మిస్ అవుతున్నారు. ప్రస్తుతం ప్రభుత్వం తీసుకున్న నిర్ణయం వల్ల వ్యయప్రయాసలు తగ్గాయని ఆనందం వ్యక్తం చేస్తున్నాడు.

పట్టించుకోని వైకాపా పాలకులు

కూలీ పని చేసుకుని జీవనం సాగించే ఆ విద్యార్థుల తల్లిదండ్రులకు అవస్థలు పడుతున్నారు. వైకాపా హయాంలో ఈ సమస్యను పరిష్కరించాలని విద్యార్థుల తల్లిదండ్రులు మొరపెట్టుకున్నా ప్రభుత్వం ఆలకించలేదు.

అండగా కూటమి ప్రభుత్వం

సీఎం చంద్రబాబు ఇటీవల నిర్వహించిన సమీక్షలో ఈ అంశం చర్చకు వచ్చింది. నవంబరు నుంచి పింఛను మొత్తాన్ని దివ్యాంగ విద్యార్థుల బ్యాంకు ఖాతాలకు జమచేసేలా చర్యలు తీసుకోవాలని ఆదేశాలు జారీ చేశారు.

మంచి నిర్ణయం



జీడీనెల్లూరు నియోజకవర్గంలోని ఎస్‌ఆర్‌పురం మండలం పద్మాపురం గ్రామానికి చెందిన ఉష కుమారుడు లోకేష్ పుత్తూరు బధిర పాఠశాలలో చదువుతున్నారు. పింఛను నగదు తీసుకునేందుకు గ్రామానికి వెళ్లాల్సిందే. ఆ విద్యార్థి ఒంటరిగా గ్రామానికి వెళ్లాలంటే కష్టమే. తల్లి ప్రతి నెలా రావాల్సిందే. సీఎం చంద్రబాబు నాయుడు తీసుకున్న నిర్ణయం ఎంతో సముచితంగా ఉందంటున్నారు.

సర్వదర్శనానికి 8 గంటలు

తిరుమల, న్యూస్‌టుడే: టోకెన్లు లేకుండా శుక్రవారం తిరుమల వచ్చిన భక్తులకు 8 గంటల్లో శ్రీవారి దర్శనం లభించనుంది. రూ.300 ప్రత్యేక ప్రవేశ దర్శనం టికెట్ల భక్తులకు 2 గంటలు పడుతోంది. గురువారం శ్రీవారిని 61,328 మంది దర్శించుకున్నారు. రూ.3.84 కోట్ల హుండీ కానుకలు లభించాయి.

అప్పుడు నిర్బంధాలు.. ఇప్పుడు నోటీసులు

తిరుపతి(నేరవిభాగం), న్యూస్‌టుడే: నిరుద్యోగులు జాబ్ క్యాలెండర్ కోసం రోడ్డెక్కుతారన్నా.. ప్రజా వ్యతిరేక విధానాలపై ప్రతిపక్షాలు నిరసన తెలుపుతాయన్నా.. ప్రభుత్వ ఉద్యోగులు కోర్కెల సాధనకు స్వరం పెంచుతారన్నా.. గత వైకాపా ప్రభుత్వంలోని పోలీసులు ఉన్నఫలంగా అక్రమ అరెస్టులు, గృహ నిర్బంధాలకు పాల్పడేవారు. ఇప్పుడు.. శ్రీవారి ప్రసాదాల్లో కల్తీ ఆరోపణలతో అట్టుడిగిపోతున్న తరుణంలో తిరుమల దర్శనార్థం వస్తున్న మాజీ సీఎం జగన్‌కు అనుకూలంగా వైకాపా శ్రేణులు ప్రతి కూడలిలో స్వాగతం పలుకుతామని ప్రకటించినా.. కూటమి పార్టీలు, హిందూ సంఘాలు డిక్లరేషన్ కోసం డిమాండ్ చేయడంతో జిల్లాలో రేగిన ఉత్కంఠకు నోటీసులతో అడ్డుకట్ట వేయగలిగారు. అప్పటికే అమలులో ఉన్న సెక్షన్ 30 పోలీస్ యాక్టు మేరకు కొన్ని గంటల్లో దాదాపు 500 మందికి నోటీసులు ఇచ్చారు. కేవలం ఒక పార్టీ నాయకులకు మాత్రమే కాకుండా.. అన్ని పార్టీల్లోని నాయకులకు నోటీసులు ఇచ్చారు. జిల్లాలో 30 పోలీస్ యాక్టు అమలులో ఉందని, సమావేశాలు, ర్యాలీలు చేయదలుచుకుంటే ముందస్తుగా అనుమతులు తీసుకోవాలని సూచించారు. నిబంధనలు ఉల్లంఘించి రోడ్డుపైకి వచ్చి శాంతిభద్రతలకు విఘాతం కలిగిస్తే చట్ట ప్రకారం చర్యలు తీసుకుంటామని పోలీసులు హెచ్చరించారు. దీంతో జిల్లాలో అక్రమ అరెస్టులు, నిర్బంధాలకు తావులేకుండా పోయింది.

నేడు శునకాలకు టీకాలు

చిత్తూరు(వ్యవసాయం), న్యూస్‌టుడే: ప్రపంచ రేబిస్ దినోత్సవాన్ని పురస్కరించుకుని శనివారం స్థానిక దర్గాకూడలిలోని బహువిధ పశువైద్యశాలలో ఉదయం 10 గంటలకు శునకాలకు టీకాలు వేస్తామని జిల్లా పశుసంవర్ధక శాఖ జేడీ ప్రభాకర్ తెలిపారు. జిల్లా వ్యాప్తంగా అన్ని పశువైద్య శాలల్లో శునకాలకు టీకాలు వేస్తామని చెప్పారు.

ర.భ.శాఖ ఈఈ బాధ్యతల స్వీకరణ



చిత్తూరు(క్రీడలు), న్యూస్‌టుడే: రహదారులు భవనముల శాఖ చిత్తూరు ఈఈగా శ్రీనివాసులు శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. ఈఈని డీఈఈలు, ఏఈలు, ఇతర సిబ్బంది మర్యాదపూర్వకంగా కలిశారు.

ఇన్‌ఛార్జి డీఎంగా సంబంధం లేని అధికారి

సీనియర్ అకౌంటెంట్ లక్ష్మీపతి నియామకంపై చర్చ

చిత్తూరు (వ్యవసాయం): వ్యవసాయ విధానాలు, సాంకేతిక పద్ధతులపై ఎలాంటి అవగాహన లేని అధికారికి ఆగ్రోస్ ఇన్‌ఛార్జి జిల్లా మేనేజరుగా నియమించడం చర్చనీయాంశమైంది. ఆగ్రోస్ (ఆంధ్రప్రదేశ్ వ్యవసాయ పరిశ్రమల అభివృద్ధి సంస్థ) ఇన్‌ఛార్జి జిల్లా మేనేజరుగా సీనియర్ గణాంకాధికారి (సీనియర్ అకౌంటెంట్) లక్ష్మీపతి నియమితులయ్యారు. రాష్ట్ర కార్యాలయంలో పనిచేస్తున్న ఈయనకు జిల్లా మేనేజరుగా పూర్తి అదనపు బాధ్యతలు అప్పగించారు. 'ఈనాడు'లో ఈ నెల 26న 'అయోమయంలో ఆగ్రోస్' శీర్షికన కథనం ప్రచురితమైంది. ఉన్నతాధికారులు స్పందించి.. గతంలో ఇన్‌ఛార్జి ఆర్ఎంగా ఉన్న జీఎం రాజామోహన్ స్థానంలో ఇన్‌ఛార్జి జిల్లా మేనేజరుగా సీనియర్ గణాంకాధికారిని నియమించారు. ఈయన చిత్తూరు జిల్లాతో పాటు అనంతపురం, కడప, కర్నూలు జిల్లాలకు ఇన్‌ఛార్జి జిల్లా మేనేజరుగా వ్యవహరించనున్నారు. ఆగ్రోస్ ద్వారా నూతన సాగు పద్ధతులు రైతులకు తెలియజేయాల్సి ఉంటుంది. ఇప్పటికే ఈ సంస్థ ద్వారా రైతులకు అందాల్సిన సేవలు పూర్తిగా నిలిచాయి. అయిదేళ్ల వైకాపా పాలనలో పలు అనాలోచిత నిర్ణయాలతో ఆగ్రోస్ సంస్థ పూర్తిగా నిర్వీర్యం కావడంతో సంస్థ సేవలు రైతులకు దూరమయ్యాయి. వ్యవసాయ ఇంజినీరు, కనీసం వ్యవసాయాధికారి స్థాయిలో పనిచేసి వారికి ఆ బాధ్యతలు అప్పగిస్తే ప్రయోజనం ఉంటుందని రైతులు పేర్కొంటున్నారు.

ఉత్సాహంగా పర్యాటక 2కె పరుగు

చిత్తూరు విద్య: ప్రపంచ పర్యాటక దినోత్సవం సందర్భంగా యువత, విద్యార్థులతో కలిసి నగరంలో శుక్రవారం 2కె పరుగు నిర్వహించారు. జిల్లా పర్యాటక, సాంస్కృతిక శాఖ ఆధ్వర్యంలో స్థానిక గాంధీ విగ్రహం వద్ద నుంచి 2కే రన్‌ను జిల్లా పర్యాటక సాంస్కృతిక శాఖ అధికారి మల్లిఖార్జున ప్రారంభించారు. పీవీకేఎన్ ప్రభుత్వ కళాశాల యువ పర్యాటక క్లబ్ కో ఆర్డినేటర్ గోపి నాయక్, ఉపాధ్యక్షుడు రెడ్డిబాషా పాల్గొన్నారు.




చిత్తూరులో 2కే రన్‌లో పాల్గొన్న విద్యార్థులు

వైభవంగా పవిత్రోత్సవాలకు అంకురార్పణ

అప్పలాయిగుంట(వడమాలపేట), న్యూస్‌టుడే: అప్పలాయిగుంట ప్రసన్న వేంకటేశ్వరస్వామి పవిత్రోత్సవాలకు శుక్రవారం వైభవంగా అంకురార్పణ జరిగింది. శ్రీవారి సర్వసేనాధిపతి విశ్వక్సేనుడు తిరుచ్చిలో ఆశీనులవ్వగా వేదపండితులు ఆలయావరణలో కార్యక్రమాన్ని నిర్వహించారు. సేనాధిపతి అంకురార్పణకు అవసరమైన పుట్టమట్టి, నవధాన్యాలు తెచ్చారు. మేది ప్రతిమ రూపొందించి ఘనంగా పూజలు చేపట్టారు. శనివారం నుంచి 30వ తేదీ వరకు మూడు రోజులు పాటు పవిత్రోత్సవాలు జరగనున్నాయి. ఏఈవో రమేష్, ఆలయాధికారి శివకుమార్, ప్రధాన అర్చకులు సూర్యకుమారాచ్చార్యులు పాల్గొన్నారు.



పుట్టమట్టి తెచ్చేందుకు బయల్దేరిన అర్చకులు



డీపీటీవోగా జగదీష్ బాధ్యతల స్వీకరణ.. చిత్తూరు (కొంగారెడ్డిపల్లి), న్యూస్‌టుడే: చిత్తూరు డీపీటీవోగా జగదీష్ శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. విజయనగరం ఆర్టీసీ కంట్రోలర్ ఆఫ్ స్టోర్స్‌గా పనిచేస్తున్న ఆయన బదిలీపై చిత్తూరు డీపీటీవోగా నియమితులయ్యారు. బాధ్యతల స్వీకరణ తర్వాత కలెక్టర్ సుమిత్‌కుమార్‌ను మర్యాదపూర్వకంగా కలిశారు.



పోటు సిబ్బంది చెప్పినా పట్టించుకోలేదు..!

- నెయ్యి బాగోలేదన్నా చర్యలు తీసుకోలేదు
- తాము అనుకున్నదే చేసిన నాటి తితిదే పాలకమండలి, అధికారులు

ఈనాడు-తిరుపతి: తిరుమలలోని ఏ మాడ వీధిలో తిరిగినా గతంలో లడ్డూ ఘుమఘుమలు ముక్కుకు తగిలేవి.. ఆ సువాసన పీలిస్తే అదో అనుభూతి కలిగేది.. స్వామి ప్రసాదాన్ని స్వీకరించినంత ఆనందం పొందేవారు.. అదంతా గతం.. వైకాపా ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన ఐదేళ్ల కాలంలో తిరుపతి లడ్డూను మిఠాయి కొట్లలోని ఒక సరకుగానే చూశారు. నాణ్యతను పక్కనబెట్టి నాసిరకం నెయ్యి, జీడిపప్పు, యాలకులు ఇతరత్రా సామగ్రిని వినియోగించారు. శ్రీవారి భక్తులకు ఎటువంటి లడ్డూ ఇచ్చినా స్వీకరిస్తారన్న అహంకారంతో వ్యవహరించారు. నాణ్యతకు తిలోదకాలు ఇచ్చి నాసిరకం దినుసులు, కల్తీవి వాడారు. దీంతో రుచి, సువాసన పూర్తిగా మారిపోయింది. ఈ విషయమై భక్తులతో పాటు పోటు సిబ్బంది పలుమార్లు అధికారుల దృష్టికి తీసుకెళ్లినా పట్టించుకోలేదు.

శ్రీవారి ఆలయంలో రోజుకు సుమారు 3.5 లక్షల లడ్డూలను తయారు చేస్తారు. ఇందుకు 14 టన్నుల నెయ్యిని వినియోగిస్తారు. ఈ నేపథ్యంలో తిరుమలలో 82,100 కిలోల సామర్థ్యంతో మూడు నెయ్యి యూనిట్లు ఉన్నాయి. భక్తులకు అవసరమైన మేరకు లడ్డూలు సరఫరా చేయాల్సిన నేపథ్యంలో 40 థర్మోఫ్లూయిడ్ స్టవ్‌లతో బూందీపోటును ఏర్పాటు చేశారు. గతంలో లడ్డూను తయారు చేసేందుకు స్వచ్ఛమైన ఆవు నెయ్యిని వినియోగించేవారు. వైకాపా హయాంలో నాసిరకం నెయ్యి వినియోగించడాన్ని తొలుత బూందీపోటులో పనిచేసే పోటు సిబ్బంది గుర్తించారు. అనేక సార్లు డిప్యూటీ, ఈవో సూపరింటెండెంట్ల దృష్టికి తీసుకువచ్చారు. అయినప్పటికీ ఎటువంటి ప్రయోజనం లేకుండా పోయింది. సాధారణంగా బూందీ, నెయ్యి కలిసినప్పుడు సువాసన వస్తుంది. మాడ వీధుల్లో తిరుగుతున్న భక్తులు సైతం ఈ సువాసనను ఆస్వాదించేవారు. నాసిరకం నెయ్యి వినియోగించినప్పటి నుంచి లడ్డూ తయారు చేసేటప్పుడే కనీసం సువాసన వచ్చేది కాదని కొందరు పోటు సిబ్బంది పేర్కొంటున్నారు. నెయ్యిని చూస్తేనే దాని ప్రమాణాలు గుర్తించవచ్చని, ఇది అధికారులకు ఎందుకు అర్థం కాలేదో తెలియట్లేదన్నారు. గతంలో దూరంగా ఉన్నా సంచీలో లడ్డూ ఉంటే ఆ వాసనకే తిరుమలకు వెళ్లి వచ్చారా అని గుర్తించే పరిస్థితి ఉండేదని, వైకాపా హయాంలో చేతిలో పట్టుకున్నా వాసన తెలియని దుస్థితి నెలకొందని సిబ్బంది వాపోయారు. అధికారులు చెప్పినా పట్టించుకోకపోవడంతో తాము ఏమీ చేయలేని పరిస్థితని ఆవేదన వ్యక్తం చేశారు. తిరుమల ఆలయ మాజీ ప్రధాన అర్చకులు రమణదీక్షితులు సైతం గతంలో లడ్డూ దూరంగా ఉన్నా సువాసన వచ్చేదని, గత ఐదేళ్లలో అది కనిపించలేదని స్పష్టం చేశారు. నిత్యం లడ్డూ తయారు చేసే పోటు సిబ్బంది, మాజీ ప్రధాన అర్చకుడు సైతం వీటిని అధికారుల దృష్టికి తీసుకెళ్లినా వారు కనీసం చర్యలు తీసుకోలేదు. దీన్ని ఆసరాగా తీసుకుని సరఫరాదారులు కల్తీ నెయ్యిని పంపి శ్రీవారికి ద్రోహం చేయడంతోపాటు భక్తుల మనోభావాలు దెబ్బతీసేలా వ్యవహరించారు.

తిరుమల ప్రక్షాళనకు పాదయాత్ర

పుంగనూరు, న్యూస్‌టుడే: ప్రపంచ ప్రసిద్ధి చెందిన తిరుమల ప్రక్షాళనకు పాదయాత్ర ప్రారంభించినట్లు బీసీవైపీ జాతీయ అధ్యక్షుడు రామచంద్రయాదవ్ అన్నారు. శుక్రవారం పుంగనూరు పట్టణంలోని హనుమంతరాయదిన్నె ఆంజనేయ స్వామి ఆలయంలో పూజలు చేసి పాదయాత్ర ప్రారంభించారు. వివిధ మఠాధిపతులు మహంత్‌కళ్యాణ్‌దాస్, శ్రీకృష్ణ యాదవానంద, రామానుజ జీయర్, పరిపూర్ణానంద స్వామీజీలు సంఘీభావం తెలిపారు. చౌడేపల్లెలో మాట్లాడుతూ తితిదేనే నెయ్యి తయారు చేసుకొని ప్రసాదాల్లో వినియోగించుకోవడం మంచిదని ఈయన సూచించారు.



పుంగనూరులో ప్రారంభమైన బీసీవైపీ అధినేత రామచంద్రయాదవ్ పాదయాత్ర

కోళ్ల ప్రయోగశాల ఏర్పాటు చేయాలి

చిత్తూరు కలెక్టరేట్, న్యూస్‌టుడే: కోళ్ల రంగానికి సంబంధించి ప్రయోగశాలను ఏర్పాటు చేయాలని కలెక్టర్ సుమిత్ కుమార్‌ను బాలాజీ హేచరీస్ డైరెక్టర్ ప్రణీత్, జిల్లా రెడ్ క్రాస్ సొసైటీ ఛైర్మన్ రమేష్‌బాబు (నెక్) కోరారు. రైతు ఉత్పత్తిదారులు శుక్రవారం కలెక్టర్‌ను కలిసి పౌల్ట్రీ రంగంపై చర్చించారు. నెక్ రమేష్‌బాబు మాట్లాడుతూ కోళ్ల ప్రయోగశాల ఏర్పాటైతే కోళ్ల వ్యాధుల నిర్ధారణ, ఔషధాలు, మేత నాణ్యత పరీక్షలకు అవకాశం ఉంటుందన్నారు. శీతలీకరణ కేంద్రాన్ని ఏర్పాటుచేస్తే.. కోడిగుడ్ల నిల్వకు అవకాశం ఉంటుందని, మంచి ధర వచ్చినప్పుడు రైతులకు లబ్ధి చేకూరుతుందన్నారు. తమిళనాడులోని నమ్మకల్ కోళ్ల ప్రయోగశాలను జిల్లా బృందం ద్వారా అధ్యయనం చేసేందుకు తగు చర్యలు చేపడతామంటూ కలెక్టర్ హామీఇచ్చారని రమేష్‌బాబు తెలిపారు. నెక్ జోనల్ ఛైర్మన్ శ్రీనివాసులు, హేమాద్రి, రవికుమార్, కన్నయ్య, మహదేవ, గోపాల్, బాలాజీ హేచరీస్ జీఎం రాజేంద్ర పాల్గొన్నారు.



కలెక్టర్ సుమిత్‌కుమార్‌తో మాట్లాడుతున్న నెక్ రమేష్‌బాబు, ప్రణీత్



జడ్పీ సీఈవో రవికుమార్‌నాయుడుకు వినతిపత్రం అందజేస్తున్న యూటీఎఫ్ నాయకులు

భవిష్యనిధి ఖాతాలు క్రమబద్ధీకరించాలి

చిత్తూరు జడ్పీ, న్యూస్‌టుడే: జిల్లా పరిషత్ భవిష్యనిధి ఖాతాలు క్రమబద్ధీకరించాలని యూటీఎఫ్ నాయకులు జడ్పీ సీఈవోకు విజ్ఞప్తి చేశారు. స్థానిక జడ్పీ కార్యాలయంలో సీఈవో రవికుమార్‌నాయుడుకు శుక్రవారం వారు వినతిపత్రం అందజేసి మాట్లాడారు. జడ్పీ పరిధిలో ఉపాధ్యాయ, ఉద్యోగుల పీఎఫ్ ఖాతాలు నెలవారీ వివరాలు ఆన్‌లైన్‌లో తీసుకొచ్చామన్నారు. 2021-22 నుంచి 2023-24వరకు ఉద్యోగి ఖాతాలోని భవిష్యనిధికి వడ్డీ జమచేసి అందుబాటులోకి తేవాలని నాయకులు చెప్పారు. నామిని పేర్లు మార్చేందుకు అవకాశం కల్పించాలని, అంతర జిల్లా బదిలీల్లో వచ్చిన ఉపాధ్యాయుల ఖాతాల్లో ప్రదర్శనకు పెట్టాలని విజ్ఞప్తి చేశారు. రాష్ట్ర కార్యదర్శి జీవీ రమణ, జిల్లా అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు సోమశేఖరనాయుడు, మణిగండన్, నాయకులు రెహానా, సుధాకరరెడ్డి, రెడ్డప్పనాయుడు పాల్గొన్నారు.

బోయకొండ ఆలయంలో పుష్పాలంకరణ

బోయకొండ (చౌడేపల్లె): బోయకొండ గంగమ్మ ఆలయాన్ని శుక్రవారం పుష్పాలంకరణతో ప్రత్యేక అకర్షణగా తీర్చిదిద్దారు. ఏటా కర్ణాటక రాష్ట్రం దేవనహళ్లికి చెందిన చంద్రశేఖర్, మనోహర్, సతీష్‌లు దసరా మహోత్సవాలకు ముందు వచ్చే శుక్రవారం ఆలయాన్ని పదేళ్లుగా అలంకరిస్తున్నారు. రూ.4 లక్షలు విలువ చేసే పూలతో ఆలయాన్ని రెండు రోజులుగా అలంకరించారు. ప్రత్యేకంగా కూర్చిన పూలదండ అమ్మవారి మెడలో వేశారు. ఉదయం నిర్వహించిన రాహుకాలాభిషేకంలో ఉభయదారులు పాల్గొన్నారు. పుష్పాలంకరణ చేసిన దాతలను ఈవో ఏకాంబరం సత్కరించారు.





ఆలయంలో ఆకట్టుకుంటున్న పుష్పాలంకరణ

వెంకాబ్ కోళ్ల ధరలు

బ్రాయిలర్ (రైతు ధర)	126
రిటైల్	148
లేయర్	115
బ్రాయిలర్స్	215
బ్రాయిలర్స్ స్కిన్ లెస్	244
లేయర్ మాంసం	195



ఎమ్మెల్సీ శ్రీకాంత్‌కు నగదు అందజేస్తున్న నాయకులు

వరద బాధితులకు రూ.8.33 లక్షల విరాళం

శాంతిపురం, న్యూస్‌టుడే: రాష్ట్రంలో వరద బాధితుల సహాయార్థం శాంతిపురం మండల తెదేపా నాయకులు, కార్యకర్తల తరపున రూ.8.33 లక్షల విరాళాన్ని ఎమ్మెల్సీ కంచర్ల శ్రీకాంత్‌కు శుక్రవారం అందజేశారు. మండలంలోని 23 పంచాయతీలకు చెందిన పార్టీ శ్రేణుల నుంచి సేకరించిన విరాళాన్ని ఎమ్మెల్సీకి అందజేసినట్లు పార్టీ అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు విశ్వనాథనాయుడు, నాగరాజు, మాజీ వైస్ ఎంపీపీ ఉదయ్‌కుమార్ తెలిపారు.

జల వనరుల శాఖలో బదిలీలు

చిత్తూరు(వ్యవసాయం), న్యూస్‌టుడే: జలవనరుల శాఖలో డీఈఈలు, ఏఈలు బదిలీ అయ్యారు. ఈ మేరకు ఆ శాఖ ఉన్నతాధికారులు ఉత్తర్వులు జారీ చేశారు. చిత్తూరు డివిజన్‌లో పనిచేస్తున్న డీఈఈ త్రిశూల్‌ను కడపకు, తిరుపతిలో పనిచేస్తున్న వెంకటశివారెడ్డిని చిత్తూరు, వి.కోట డీఈఈ నాయక్ కుప్పంకు బదిలీ అయ్యారు. అలాగే ఏఈలు మధుకుమార్ (పులిచెర్ల నుంచి చిత్తూరు), మహలింగం (నగరి నుంచి పిచ్చాటూరు), స్వప్న (కుప్పం నుంచి వి.కోట), విజయకుమార్ (పీలేరు నుంచి చిత్తూరు సబ్-డివిజన్-2), భరత్‌కుమార్‌రెడ్డి(చిత్తూరు నుంచి పెనుమూరు), శివమ్మ (పెనుమూరు నుంచి సర్కిల్ కార్యాలయం), మునిశంకర్‌రెడ్డి (తిరుపతి నుంచి బిల్డింగ్ విభాగం), పీరా (చిత్తూరు నుంచి బంగారుపాళ్యం) బదిలీ అయ్యారు.

అంతర్రాష్ట్ర దొంగల అరెస్టు

23 ద్విచక్ర వాహనాల స్వాధీనం

పుంగనూరు, న్యూస్‌టుడే: పుంగనూరు మండలంలోని చదళ్లలో 23 ద్విచక్రవాహనాలను స్వాధీనం చేసుకుని అంతర్రాష్ట్ర దొంగల ముఠాలో నలుగురిని అరెస్టు చేశామని సీఐ శ్రీనివాసులు తెలిపారు. శుక్రవారం స్థానిక విలేకరులకు వివరాలు వెల్లడించారు. కర్ణాటక రాష్ట్రం ముళబాగల్ ప్రాంతానికి చెందిన హుస్సేన్(27), మహ్మద్ వసీం(24), ముబారక్ పాషా(19), ఆసిఫ్(28)లు చదళ్లలో ఓ ఇంటిని అద్దెకు తీసుకుని పాత ద్విచక్ర వాహనాల వ్యాపారం పేరుతో చోరీలకు పాల్పడేవారని పేర్కొన్నారు. పట్టణ, గ్రామీణ ప్రాంతాలకు చెందిన 23 ద్విచక్ర వాహనాలు స్వాధీనం చేసుకోగా మరో నిందితుడు పరారీలో ఉన్నాడని తెలిపారు. అతను పట్టుబడితే మరిన్ని ద్విచక్ర వాహనాలు స్వాధీనం చేసుకునే అవకాశం ఉందన్నారు.

శునకం అడ్డుపడి..

రోడ్డు ప్రమాదంలో యువకుడి మృతి

రామకుప్పం, న్యూస్‌టుడే: శునకం అకస్మాత్తుగా అడ్డురావడంతో ద్విచక్ర వాహన చోదకుడు అదుపుతప్పి ప్రమాదానికి గురయ్యాడు. వైద్యశాలలో చికిత్స పొందుతూ మృతి చెందాడు. పోలీసుల కథనం మేరకు.. రామకుప్పం మండలం కెంచనబల్లకు చెందిన గణేశ్(18) గురువారం రాత్రి బల్ల గ్రామం నుంచి స్వగ్రామం కెంచనబల్లకు ద్విచక్ర వాహనంలో వెళుతున్నాడు. కెంచనబల్ల సమీపంలో శునకం అడ్డు రావడంతో ద్విచక్ర వాహనం అదుపుతప్పి కిందపడి గాయాలకు గురయ్యాడు. అటు వెళ్తున్న వాహనదారులు గుర్తించి కుప్పం ఆస్పత్రికి తరలించారు. మెరుగైన చికిత్స కోసం తిరుపతి తీసుకెళ్లగా చికిత్స పొందుతూ శుక్రవారం సాయంత్రం మృతి చెందినట్లు తెలిపారు. గణేశ్ తల్లి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు వెల్లడించారు.



గణేశ్ (పాతచిత్రం)

నిద్రలోనే మృత్యు ఒడిలోకి

యువకులను బలిగొన్న రోడ్డు రోలర్

బైరెడ్డిపల్లె, న్యూస్‌టుడే: పెళ్లీడుకొచ్చిన యువకులు బతుకుతెరువు కోసం కాపాలాదారులుగా వెళ్లి రోడ్డు రోలర్ కింద బలైపోయిన సంఘటన బైరెడ్డిపల్లె మండలం తీర్థం గ్రామంలో గురువారం అర్ధరాత్రి చోటుచేసుకుంది. పలమనేరు గ్రామీణ సీఐ మురళీమోహన్ కథనం మేరకు.. బైరెడ్డిపల్లె మండలం తీర్థం గ్రామానికి చెందిన ముబారక్ కుమారుడు అష్రఫ్(24), షమీఉల్లా కుమారుడు సాధిక్(26) చెన్నై-బెంగళూరు ఎక్స్‌ప్రెస్ హైవే నిర్మాణ పనుల గుత్తేదారు వద్ద కాపలాదారులు(నైట్ వాచ్‌మెన్)గా పనిచేస్తున్నారు. రోజులాగే గురువారం రాత్రి రహదారి నిర్మాణ వాహనాల వద్ద కాపలాగా పడుకున్నారు. నిద్రలోకి ఉపక్రమించిన కొద్దిసేపటికి ఓ రోడ్డు రోలర్ చోదకుడు వాహనాన్ని నడుపుకొంటూ నిద్రిస్తున్న వారిని గుర్తించకుండా వెళ్లాడు. దీంతో వాహనం కింద పడి అష్రఫ్, సాధిక్ ఇద్దరు అక్కడికక్కడే మృతి చెందారు. ప్రమాదం జరిగిన వెంటనే రోడ్డు రోలర్ చోదకుడు పారిపోయాడు. ప్రమాదాన్ని గుర్తించిన అదే గ్రామానికి చెందిన మరో ఇద్దరు కాపలాదారులు విషయాన్ని గ్రామస్థులకు తెలియజేశారు. కుటుంబ సభ్యులు అక్కడికి చేరుకుని ఆందోళనకు సిద్ధమయ్యారు. గ్రామస్థులు వారికి నచ్చజెప్పి పోలీసులకు ఫిర్యాదు చేశారు. మృతుల కుటుంబీకుల ఫిర్యాదు మేరకు మృతదేహాలను పంచనామా నిమిత్తం పలమనేరు ప్రభుత్వాసుపత్రికి తరలించి కేసు దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

తీర్థం గ్రామంలో విషాదం.. యువకుల మృతితో తీర్థం గ్రామంలో విషాదఛాయలు అలుముకున్నాయి. కుటుంబీకులు, బంధువుల రోదనలతో గ్రామం శోకసంద్రమైంది. అష్రఫ్ తండ్రి చనిపోవడంతో తల్లి సంరక్షణలో ఉంటున్నాడు. ఇతను పగలు వేళ వైరెడ్డిపల్లె పరిధిలో ద్విచక్ర వాహనాల మెకానిక్.. రాత్రి వాచ్‌మెన్‌గా పని చేస్తూ కుటుంబానికి ఆసరాగా ఉంటున్నాడు. సాధిక్ పలమనేరులోని ఓ కిరాణా దుకాణంలో పనిచేస్తుండేవాడు. అక్కడ పని మాని నెల నుంచి నైట్ వాచ్‌మెన్‌గా పనిచేస్తున్నాడు. ఇతనికి ముగ్గురు సోదరులు ఉన్నారు.



అష్రఫ్ (పాతచిత్రం)



సాధిక్ (పాతచిత్రం)



కలెక్టర్ సుమిత్‌కుమార్‌కు పుష్పగుచ్ఛం అందిస్తున్న డ్వామా పీడీ రవికుమార్

కలెక్టర్‌ను కలిసిన నూతన అధికారులు

చిత్తూరు కలెక్టరేట్, న్యూస్‌టుడే: కలెక్టర్ సుమిత్ కుమార్‌ను నూతనంగా బాధ్యతలు చేపట్టిన అధికారులు శుక్రవారం మర్యాదపూర్వకంగా కలిశారు. డ్వామా పీడీ రవికుమార్, ఎక్సైజ్ డిప్యూటీ కమిషనర్ విజయశేఖర్, ఏపీఎస్ జేడీఎం వెంకట సుబ్బారావు, ఐసీడీఎస్ పీడీ హైమావతి ఆయనకు పుష్పగుచ్ఛం అందించారు.

చిత్తూరు

• చిత్తూరు • పూతలపట్టు • గంగాధరనెల్లూరు • నగరి

ముందస్తు నోటీసులు.. విజయపురం: మాజీ సీఎం జగన్‌మోహన్‌రెడ్డి తిరుమల పర్యటన సందర్భంగా శాంతి భద్రతలకు విఘాతం కలిగే ప్రమాదం ఉండటంతో వైకాపా నాయకులకు పోలీసులు ముందస్తు నోటీసులు జారీ చేశారు. ఎస్సై బలరామయ్య, ఏఎస్సై గోవిందరాజులు శుక్రవారం అందించారు.

మేమున్నాం.. మీకు తోడుగా.. (10 AM TO 1 PM)
చిత్తూరు నగరం: 80085 74598
నగరి: 80085 74568
గంగాధరనెల్లూరు: 80085 74605
పూతలపట్టు: 80085 74601

న్యూస్‌టుడే, నగరి

సమస్య: ఉయ్యాల కాలవ(సాగునీటి కాలువ)లో పట్టణంలోని చికెన్ దుకాణదారులు కోళ్ల వ్యర్థాలను నిర్లక్ష్యంగా వేస్తున్నారు. – చిట్టి, నగరి.

సమాధానం: సమస్య పరిశీలించి చర్యలు తీసుకుంటాం. –రాజగోపాల్, ఏఈ, జలవనరులశాఖ

న్యూస్‌టుడే, చిత్తూరు నగరం

సమస్య: గాయత్రినగర్‌కాలనీలో నివాసాల మధ్య చెత్త వ్యర్థాలు పేరుకుని దోమల బెడద ఎక్కువగా ఉంది. **- స్థానికులు**

సమస్య: స్థానిక సుందరయ్యర్ వీధిలో చెత్త డబ్బాల్లో వ్యర్థాలు నిండినా సిబ్బంది సకాలంలో తొలగించడం లేదు. దీంతో పరిసరాలు అపరిశుభ్రంగా మారుతున్నాయి. **- స్థానికులు**

సమాధానం: వ్యర్థాలు తొలగించి.. దోమల నివారణకు ఫాగింగ్ చేయిస్తాం. **- అనిల్ కుమార్, నగరపాలక ఆరోగ్యాధికారి**

విద్యుత్తు శాఖలో బాధ్యతల స్వీకరణ



శేషాద్రిరెడ్డి



రాజా

చిత్తూరు(మిట్టూరు), న్యూస్‌టుడే: విద్యుత్తు శాఖ చిత్తూరు అర్బన్ డివిజన్‌లో అధికారులు శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. చిత్తూరు రూరల్ విభాగం-2 డీఈఈగా శేషాద్రి రెడ్డి బాధ్యతలు స్వీకరించారు. ఆ శాఖ ఇంజినీర్లు, అధికారులు, సిబ్బంది ఆయనకు పుష్పగుచ్ఛాలు అందజేసి అభినందించారు. అలాగే అర్బన్ డివిజన్ వాణిజ్య విభాగం(కమర్షియల్)ఏఈగా శ్రీనివాసులు బాధ్యతలు స్వీకరించారు. విద్యుత్తు శాఖ కన్‌స్ట్రక్షన్ విభాగం చిత్తూరు డివిజన్ ఏఈగా రాజా శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు.



అశోక్ కుమార్



ఆనంద్

సబ్ రిజిస్ట్రార్లు.. చిత్తూరు కలెక్టరేట్: చిత్తూరు అర్బన్ సబ్ రిజిస్ట్రార్‌గా అశోక్ కుమార్, రూరల్ సబ్ రిజిస్ట్రార్‌గా ఆనంద్.. శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. వారిని కార్యాలయ సిబ్బంది మర్యాదపూర్వకంగా కలిశారు. **బంగారుపాళ్యం:** సబ్ రిజిస్ట్రార్‌గా యోగానంద్ బాధ్యతలు చేపట్టారు. దస్తావేజు లేఖరులు ఆయన్ను సన్మానించారు. **పుత్తూరు:** పుత్తూరు సబ్‌రిజిస్ట్రార్‌ విజయభాస్కర్, డీటీ అశోక్‌రెడ్డి బాధ్యతలు స్వీకరించారు.



వెంకట్రామిరెడ్డి

నగరపాలక ఎంఈ..: చిత్తూరు నగరం: నగరపాలక సంస్థ నూతన ఎంఈ (మున్సిపల్ ఇంజినీర్)గా వెంకటరామిరెడ్డి బాధ్యతలు చేపట్టారు. తిరుపతిలో పనిచేస్తూ ఆయన ఇక్కడికి వచ్చారు.



శ్రావణ్ కుమార్

తహసీల్దార్.. పెనుమూరు: నూతన తహసీల్దారుగా శ్రావణ్ కుమార్(ఎఫ్ఏసీ) శుక్రవారం పదవీ బాధ్యతలు స్వీకరించారు. ఆయన్ను కార్యాలయ సిబ్బంది శాలువా కప్పి సత్కరించారు.

నిర్మించు..అనుభవించు

● నీవానదిలో యథేచ్ఛగా ఆక్రమణలు ● జోరుగా ఇళ్ల నిర్మాణాలు..కుంచించుకుపోతున్న నది
● చోద్యం చూస్తున్న నగరపాలక, జలవనరుల శాఖలు



మునిగిన నీవానది పరివాహక ప్రాంతం (విహంగ వీక్షణం)

చిత్తూరు నగరం : నగరంలోని నీవానదిలో ఆక్రమణలు ఎక్కువయ్యాయి. అడిగేవారు లేకపోవడంతో యథేచ్ఛగా నదిలో ఇళ్ల నిర్మాణాలు చేపట్టి నది రూపురేఖలు లేకుండా చేస్తున్నారు. గతంలో చిత్తూరుకే తలమానికంగా నిలిచిన నదిని సంరక్షించడంలో నగరపాలక, నీటిపారుదలశాఖలు విఫలమయ్యాయి. ఫలితంగా ఆక్రమణల కోరల్లో చిక్కుకుంది. నదులు, చెరువుల్లో దురాక్రమణలు చేయరాదని.. అలా చేపడితే సంబంధిత వ్యక్తులపై కఠిన చర్యలు చేపట్టాలని దేశ అత్యున్నత న్యాయస్థానం (సుప్రీంకోర్టు) ఉత్తర్వులు జారీ చేసింది. [illegible] నగరంలోని నీవానదిని కబ్జా చేసి పరివాహక ప్రాంతాల వాసులు ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నారు.

నది పొడవునా..

ఐరాల, బంగారుపాళ్యం మండలాల నుంచి రెండు వంకలు కలిసి చిత్తూరు మీదుగా నీవానది ప్రవహిస్తుంది. దీంతో చిత్తూరు నగరానికి ప్రధాన నీటి వనరుగా నగర ప్రజల అవసరాలు తీర్చింది. నగరంలో ఈ నది ప్రవాహం ఇరువారం పోతంబట్టు నుంచి దొడ్డిపల్లి వరకు దాదాపు 6 కిలోమీటర్ల పొడవున విస్తరించి ఉంది. నగరం ఒడ్డున ఉన్న ఈ నదిని ఆనుకుని ఇళ్లు, భవన సముదాయాలు ఉన్నాయి. అయితే కాలక్రమేణా నదిలో వచ్చే ప్రధాన వాగులు మూసుకుపోవడంతో నీటి ప్రవాహం తగ్గిపోయింది. దీంతో ఈ నది మురుగు ప్రవాహంగా మారింది. నల్లటి రంగులో బురదతో కూడిన నీరు మాత్రమే నదిలో ప్రవహిస్తోంది. నది తమిళనాడులోని పొన్నై నదిలో కలుస్తుంది.

ఈ ప్రాంతాల్లో అధికం

గంగనపల్లె నుంచి తేనెబండ, వీరభద్రకాలనీ, రంగాచారివీధి, సంతపేట లిడ్డీ వంతెన కింది భాగం, తోటపాళ్యం, కైలాసపురం ప్రాంతాల్లో ఆక్రమణలు ఎక్కువయ్యాయి. ఈ ప్రాంతాల్లో నదిని ఆనుకుని ఉన్న ఇళ్ల నిర్మాణాలను పొడిగించడం, కొత్త నిర్మాణాలు ఎక్కువవుతున్నాయి. గతంలో కైలాసపురం ప్రాంతంలో పునాదుల నిర్మాణం ప్రారంభించగా.. నగరపాలక పట్టణ ప్రణాళిక విభాగం సిబ్బంది ధ్వంసం చేశారు. ఆక్రమణలు పెరిగిపోవడంతో పరివాహక ప్రాంతాల్లో నది విస్తీర్ణం కుంచించుకుపోయింది. వర్షాలు పడిన సందర్భాల్లో ప్రవాహం ఎక్కువై.. రాజుగుడికి (ఈశ్వరాలయం) వెళ్లే తాత్కాలిక కొట్టుకుపోవడం పరిపాటిగా మారింది.



నదిలో మునిగిన గృహాలు (పాత చిత్రం)

పొంచి ఉన్న వరద ముప్పు

నీవానదిలో ఆక్రమంగా నిర్మించిన ఇళ్లకు ప్రమాదాలు లేకపోలేదు. ప్రస్తుతం నదిలో నీటి ప్రవాహం భారీగా లేకపోయినా.. వరదలు వచ్చిన సందర్భాల్లో ఈ నది ఉప్పొంగే ప్రమాదం ఉంది. గతంలో పొన్నై నదికి వరదలు వచ్చినప్పుడు దీని ప్రభావం నీవానదిలో కనిపించింది. ఐదు నుంచి పది సెంటీమీటర్ల వర్షాలు పడినప్పుడు పొన్నై నదికి వరదనీరు చేరితే చిత్తూరుకు ఇబ్బందే. రెండు దశాబ్దాల కిందట ఇలాంటి ప్రమాదమే సంభవించింది. నీవానదికి వరదలు రావడంతో తోటపాళ్యం వద్ద ఇళ్లు మునిగిపోయాయి. నగరపాలక, నీటిపారుదలశాఖల అధికారులు చర్యలు ప్రారంభించాలని నగర ప్రజలు కోరుతున్నారు.

నోటీసులు జారీ చేస్తాం

నీవానదిలో ఆక్రమణదారుల్ని గుర్తించి ఖాళీ చేయమని నోటీసులు జారీ చేస్తాం. ఆక్రమణల తొలగింపునకు చర్యలు చేపడతాం.
- రామకృష్ణుడు, ఏసీపీ, నగరపాలక పట్టణ ప్రణాళిక విభాగం

వ్యర్థాల తొలగింపు

మండల పరిధి పచ్చికాపల్లం ఉన్నత పాఠశాల ప్రహరీ పక్కన పారిశుద్ధ్యం లోపించిందని శుక్రవారం ఈనాడు మినీలో వచ్చిన కథనానికి స్పందనగా పంచాయతీ అధికారులు చర్యలు చేపట్టి వ్యర్థాలను తొలగించారు. ఈవోపీఆర్డీ పురుషోత్తం, పంచాయతీ కార్యదర్శి మోహన్‌కుమార్ పంచాయతీ సిబ్బందితో పనులు చేయించారు.

స్పందనకు వందనం

- న్యూస్‌టుడే, వెదురుకుప్పం

కాల్వ శుభ్రం

పాలసముద్రం, న్యూస్‌టుడే: మండలంలోని గంగమాంబపురం పంచాయతీ దళితవాడలోని అపరిశుభ్ర మురుగు కాలువ శుభ్రం చేశారు. మురుగునీటి కాలువపై ఇబ్బందులు ఎదుర్కొంటున్న సమస్యపై శుక్రవారం మేమున్నాం మీకు తోడుగాలో సమస్య ప్రచురితమైంది. స్పందించిన ఎంపీడీవో విద్యావతి ఆదేశాల మేరకు ఈవోపీఆర్డీ రమేష్‌బాబు, సర్పంచి హరి పనులు చేయించారు.

మతం చెప్పని జగన్ క్షమాపణ చెప్పాలి



కోదండ యాదవ్

చిత్తూరు (జిల్లా పంచాయతీ), న్యూస్‌టుడే: మతం చెప్పని మాజీ సీఎం జగన్‌మోహన్‌రెడ్డి ప్రజలకు క్షమాపణ చెప్పాలని తెదేపా చిత్తూరు పార్లమెంటు నియోజకవర్గ ప్రధాన కార్యదర్శి కోదండ యాదవ్ డిమాండ్ చేశారు. శుక్రవారం చిత్తూరులో విలేకర్లతో మాట్లాడారు. జగన్ రెడ్డి అబద్ధాలు చెప్పి ప్రజలకు తప్పుడు సంకేతాలు ఇస్తున్నారని, ఆయనను తిరుమల రాకుండా ఎవరూ అడ్డుకోలేదన్నారు. తితిదే ఆగమ శాస్త్రం, నియమ నిబంధనల ప్రకారం అన్యమతస్తులు డిక్లరేషన్ రిజిస్టర్‌లో సంతకం చేసిన తర్వాతే స్వామి వారిని దర్శించుకోవాలని చెప్పడం జరిగిందన్నారు. ముఖ్యమంత్రి హోదాలో భార్యతో కలిసి పట్టు వస్త్రాలు ఎందుకు స్వామి వారికి సమర్పించలేదని ప్రశ్నించారు.

ఉచిత నేత్ర పరీక్షలు

పుత్తూరు: స్థానిక రాస్ కార్యాలయంలో మహిళా పొదుపు సంఘాల సభ్యులకు శుక్రవారం ఉచిత కంటి వైద్య శిబిరం నిర్వహించారు. శంకరనేత్రాలయ డాక్టర్ వెంకటముని మాట్లాడుతూ 40 సంవత్సరాలు దాటిన మహిళలు విధిగా కంటి పరీక్షలు చేయించుకోవాలన్నారు. 150 మందికి పరీక్షలు నిర్వహించి 16 మందిని శస్త్రచికిత్సకు ఎంపిక చేశామన్నారు.

భక్తిశ్రద్ధలతో గణేశ దీక్ష ఇరుముడుల సమర్పణ



గణేశ దీక్ష ఇరుముడులు సమర్పిస్తున్న గ్రామస్థులు, చిత్రంలో ఈవో గురుప్రసాద్



వరసిద్ధుడి మహాలడ్డూను వేలంలో పొందిన విజయం విద్యాసంస్థల అధినేత తేజోమూర్తి, చిత్రంలో ఎమ్మెల్యే


కాణిపాకం, న్యూస్‌టుడే: శ్రీ వరసిద్ధి వినాయక స్వామివారి ఆలయంలో గ్రామాలకు చెందిన సుమారు 75 మంది భక్తులు ‘గణేశ దీక్ష’ ఇరుముడులను శుక్రవారం సమర్పించారు. దీక్ష భక్తులకు ఆలయ ఈవో పి.గురుప్రసాద్, అర్చకులు స్వాగతం పలికి దర్శన ఏర్పాట్లు చేశారు. తెప్పోత్సవం సందర్భంగా భక్తులకు ఉభయదారులు ఉచిత ప్రసాదాలను అందించారు. స్వామివారిని తెలంగాణ ఎమ్మెల్సీ పట్నం మహేందర్‌రెడ్డి ఉదయం దర్శించుకున్నారు. ప్పోత్సవం సందర్భంగా ఆలయ ఆస్థానమండపంలో ఏర్పాటు చేసిన హరికథ, భక్తిపాటల ఆలాపన, భరతనాట్య, కూచిపూడి నృత్యం, పౌరాణిక నాటక ప్రదర్శనలు భక్తులను విశేషంగా ఆకట్టుకున్నాయి. స్వామివారికి నివేదించిన 21 కిలోల లడ్డూ ప్రసాదాన్ని రూ. 4.25 లక్షలకు చిత్తూరుకు చెందిన విజయం విద్యాసంస్థల అధినేత డాక్టర్ ఎం.తేజోమూర్తి శుక్రవారం రాత్రి నిర్వహించిన వేలంలో సొంతం చేసుకున్నారు. **తిరుమల:** శ్రీవారిని శుక్రవారం ఉదయం ఎమ్మెల్యే మురళీమోహన్ దర్శించుకున్నారు.



కళాకారులతో ఎమ్మెల్యే మురళీమోహన్

అవివాహితులకు సువర్ణావకాశం

నేడు, రేపు క్షత్రియ కుల వధూవరులకు ఈనాడు పెళ్లిపందిరి ఉచిత ప్రొఫైల్ రిజిస్ట్రేషన్ కార్యక్రమం



తెలుగింటి వివాహ పరిచయాలకు ఆత్మీయ వేదిక అయిన ఈనాడు పెళ్లిపందిరి క్షత్రియ కుల అవివాహిత వధూవరులకు ఉచిత ప్రొఫైల్ రిజిస్ట్రేషన్ కార్యక్రమాన్ని నిర్వహిస్తుంది. తిరుపతి, దేవేంద్ర థియేటర్ రోడ్డు, రైల్వే కాలనీలోని ఈనాడు ఆఫీసు వేదికగా ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నారు. వివాహం కోసం ఎదురు చూస్తున్న వారు వధూవరులతో పాటు సంబంధిత కుటుంబీకులు **నేడు (28 సెప్టెంబర్ 2024, శనివారం), రేపు (29 సెప్టెంబర్ 2024 ఆదివారం) ఉదయం 9 గం. నుంచి సాయంత్రం 5.30 గం. వరకు** ఈ కార్యక్రమంలో పాల్గొని తమ ప్రొఫైల్‌ను ఉచితంగా రిజిస్టర్ చేసుకోవచ్చు.

మరిన్ని వివరాలకు **91547 72006 & 80080 02165** ఫోన్ నంబర్లను సంప్రదించవచ్చు.

ఉచిత ప్రొఫైల్ రిజిస్ట్రేషన్ ఫోన్ ద్వారా కూడా చేసుకోవచ్చు. రిజిస్ట్రేషన్ చేయదలచిన వధూవరుల బయోడేటా, ఫొటోలు పైన తెలియజేసిన వాట్సాప్ ఫోన్ నంబర్లకు పంపవచ్చు.



కుంభాభిషేక పూజల్లో పాల్గొన్న భక్తులు

కనులపండువగా కుంభాభిషేకం


చిత్తూరు(సంతపేట), న్యూస్‌టుడే: జీడీనెల్లూరు మండలం పెడకంటిపల్లిలో మేల్ మరువత్తూరు ఆదిపరాశక్తి శిద్దుల పీఠం నూతన ఆలయ ప్రారంభోత్సవం సందర్భంగా శుక్రవారం కుంభాభిషేక వేడుకల్ని నిర్వహించినట్లు ఓంశక్తి భక్తుల సంఘం జిల్లా అధ్యక్షురాలు సరిత ఓ ప్రకటనలో తెలిపారు. సభ్యులు ఆర్ముగం, గిరిజ గ్రామస్థులు పాల్గొన్నారు.

బిల్లులు రాలేదని మామిడి రైతు ఆవేదన

పాలసముద్రం, న్యూస్‌టుడే: మామిడి కాయలు కంపెనీలకు విక్రయించి నెలలు గడుస్తున్నా.. బిల్లులు ఇవ్వలేదని మామిడి రైతు వెంకటేశులు ఆవేదన వ్యక్తం చేశారు. శుక్రవారం మండలంలోని ఎస్ఆర్ఆర్‌కండ్రిగ పంచాయతీ తొట్టికండ్రిగ గ్రామానికి చెందిన వెంకటేశులు మామిడి రైతు మాట్లాడారు. గంగాధరనెల్లూరు మండలంలోని జైన్‌ఫ్యాక్టరీకి 5 టన్నుల మామిడిని జూన్‌లో తోలించారు. మూడు నెలలు గడుస్తున్నా నేటికీ బిల్లులు అందలేదని ఆవేదన చెందారు.

ప్రాంగణ ఎంపికల్లో 22 మందికి ఉద్యోగాలు

పుత్తూరు,న్యూస్‌టుడే: ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో శుక్రవారం నిర్వహించిన జాబ్‌మేళాలో 22 మంది ఉద్యోగాలు సాధించినట్లు కళాశాల ప్రిన్సిపల్ కోటేశ్వరయ్య తెలిపారు. ఉద్యోగ మేళాకు 56 మంది విద్యార్థులు పేర్లు నమోదు చేసుకోగా.. ప్రతినిధులు విద్యార్థులకు ఇంటర్వ్యూలు నిర్వహించి 22 మందిని ఉద్యోగాలకు ఎంపిక చేశారు. వైస్ ప్రిన్సిపల్ వీరయ్య, జిల్లా నైపుణ్యాభివృద్ధి సంస్థ, సీడాప్ ప్లేస్‌మెంట్ అధికారులు చైతన్య, లోకేష్ పాల్గొన్నారు.



ఎంపికైనవారితో ప్రిన్సిపల్ కోటేశ్వరయ్య, వైస్ ప్రిన్సిపల్ వీరయ్య

తహసీల్దారు కార్యాలయం తనిఖీ.. తవణంపల్లె: తహసీల్దారు కార్యాలయాన్ని చిత్తూరు ఆర్డీవో చిన్నయ్య తనిఖీ చేశారు. డీకేటీ భూములను పట్టా భూములుగా మార్చిన రికార్డులు పరిశీలించారు. రికార్డుల నిర్వహణపై పలు రకాల సలహాలు, సూచనలిచ్చారు. తహసీల్దారు సుధాకర్, డీటీ వెంకట రమణ, రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

తెదేపా పాలనలోనే రాష్ట్రాభివృద్ధి.. కార్వేటినగం: తెదేపా పాలనలోనే రాష్ట్రాభివృద్ధి సాధ్యమవుతుందని ఆ పార్టీ నియోజకవర్గ బీసీ సెల్ అధ్యక్షుడు రవియాద్ అన్నారు. కార్వేటినగరంలో ఇది మంచి ప్రభుత్వం కార్యక్రమంలో భాగంగా కరపత్రాలు శుక్రవారం పంపిణీ చేశారు. జగన్నాథం, సందాని, హరి పాల్గొన్నారు.

నూతన కార్యవర్గం.. బంగారుపాళ్యం: యూటీఎఫ్ మండల నూతన కార్యవర్గ ఎన్నిక శుక్రవారం జరిగింది. గౌరవాధ్యక్షులుగా రామమూర్తి, అధ్యక్షులుగా మహేష్‌బాబు, ప్రధాన కార్యదర్శి మోహన్‌రెడ్డి, అసోషియేట్ అధ్యక్షులుగా బాలాజీ, మహిళా అధ్యక్షురాలుగా అమూల్యం, కోశాధికారిగా బాలాజీ, కొందరిని జిల్లా, మండల కార్యదర్శులుగా ఎన్నుకున్నారు.

సామాజిక సేవ అలవడుతుంది.. గుడిపాల: ఎన్‌సీసీ ద్వారా విద్యార్థుల్లో సామాజికసేవ, దేశభక్తి, జాతీయభావం అలవడుతుందని 35వ ఆంధ్ర బెటాలియన్ నాయక్ సుబేదార్ రాకేష్ లాల్ అన్నారు. శుక్రవారం మండలంలోని సీఎన్ఆర్ కళాశాలలో ఎన్‌సీసీకి విద్యార్థులను ఎంపిక చేశారు. 27 మంది విద్యార్థులను ఈ సందర్భంగా అభినందించారు. సీఈఓ కల్నల్ మోనిష్, హవల్దార్ మొగిలి నాయుడు, టేకర్ అధికారి హేమంత్ పాల్గొన్నారు.

జిల్లా స్థాయి పోటీలకు ఇద్దరు విద్యార్థినులు.. పుత్తూరు: స్వర్ణాంధ్ర విజన్-2047 కార్యక్రమంలో భాగంగా పుత్తూరు బాలికల జడ్పీ ఉన్నత పాఠశాలలో నిర్వహించిన మండల స్థాయి వ్యాసరచన, వక్తృత్వ పోటీల్లో జిల్లా స్థాయికి ఇద్దరు విద్యార్థినులు ఎంపికయ్యారు. శ్రీదేవి(బాలికల జడ్పీ ఉన్నత పాఠశాల, 10వ తరగతి, ప్రథమస్థానం), వక్తృత్వ పోటీల్లో చరిష్మ(రాచపాళెం జడ్పీ ఉన్నత పాఠశాల) మొదటి స్థానంలో నిలిచినట్లు తెలియజేశారు.

సినిమా చిత్రీకరణలో నటి రాశి

చిత్తూరు(క్రీడలు): సినీ నటి రాశి చిత్తూరు నగరంలో తళుక్కుమన్నారు. తమిళ చిత్రం ‘ఉసురే’ షూటింగ్ చిత్తూరు నగర, మండల పరిసరాల్లో జరుగుతోంది. కట్టమంచిలోని శివాలయంలో శుక్రవారం కీలక సన్నివేశాల్ని చిత్రీకరించారు. తమిళ హాస్య నటుడు తంగరాజ్ ఇతర నటులు ఉన్నారు.



కట్టమంచిలోని శివాలయంలో సినీ నటి రాశి తదితరులు

29న నేత్ర వైద్య శిబిరం

చిత్తూరు(సంతపేట): జైన్ సంఘం ఆధ్వర్యంలో ఈ నెల 29న స్థానిక రాములవారిగుడి వీధిలోని జైన్ ప్రార్థనా మందిరంలో ఉదయం 8 గంటలకు ఉచిత కంటి వైద్య శిబిరాన్ని నిర్వహించనున్నట్లు ఆ సంఘ కార్యదర్శి సుభాష్ జైన్ శుక్రవారం తెలిపారు. తిరుపతి ఎస్వీ అరవింద కంటి ఆసుపత్రిలో ఉచితంగా శస్త్రచికిత్సలు జరిపిస్తామన్నారు.



పారిశుద్ధ్య కార్మికులకు దుస్తులు అందజేస్తున్న పీడీ కార్తీక్‌రెడ్డి

సంపూర్ణ పారిశుద్ధ్యమే లక్ష్యం కావాలి

జీడీనెల్లూరు: ప్రతిఒక్కరూ వ్యక్తిగత, పరిసరాల పరిశుభ్రత పాటిస్తూ సంపూర్ణ పారిశుద్ధ్యం లక్ష్యంగా పెట్టుకోవాలని జాతీయ రహదారి పీడీ కార్తీక్‌రెడ్డి అన్నారు. శుక్రవారం ఆయన జీడీనెల్లూరులో జాతీయ రహదారి అథారిటీ కేసీసీ కన్‌స్ట్రక్షన్ ఆధ్వర్యంలో జరిగిన స్వచ్ఛతా హీ సేవా కార్యక్రమంలో పాల్గొని, పారిశుద్ధ్య కార్మికులకు ఏకరూప దుస్తులు అందజేశారు. స్థానిక సర్పంచి సుబ్రహ్మణ్యం పాల్గొన్నారు. దేశ చిత్రపటం రూపంలో విద్యార్థులను కూర్చోబెట్టారు.

పరిశుభ్రతతో ఆరోగ్యం..చిత్తూరు నగరం: పరిసరాల పరిశుభ్రతతో ఆరోగ్యంగా ఉండవచ్చని నగరపాలక ఆరోగ్యాధికారి అనిల్ కుమార్ సూచించారు. స్వచ్ఛతా హీ సేవా భాగంగా శుక్రవారం స్థానిక చర్చివీధి, పొన్నియమ్మన్ ఆలయం వీధుల్లో వ్యాపారులతో కలిసి వీధులు శుభ్రం చేశారు.

ముగిసిన ముఖాముఖిలు .. నగరి, న్యూస్‌టుడే: రెవిన్యూ డివిజన్ పరిధిలోని నగరి, కార్వేటినగరం, గంగాధరనెల్లూరు, పాలసముద్రం, నింద్ర మండలాల్లోని అంగన్‌వాడీ కార్యకర్తలు, సహాయకుల భర్తీకి శుక్రవారం ముఖాముఖి నిర్వహించారు. ఆర్డీఓ కార్యాలయంలో ఆర్డీఓ వెంకటరెడ్డి సమక్షంలో అభ్యర్థులను ఎంపిక చేయడం జరిగిందని సీడీపీఓ కృష్ణవేణి తెలిపారు. స్త్రీ శిశు సంక్షేమ శాఖ జిల్లా అధికారి ఎస్.నాగశైలజ, జిల్లా అధికారి అనిల్ కుమార్, సీడీపీఓ పద్మసునంద పాల్గొన్నారు.

చిత్తూరులో భారీ వర్షం.. చిత్తూరు(వ్యవసాయం), న్యూస్‌టుడే: బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడనం ప్రభావంతో శుక్రవారం రాత్రి చిత్తూరు, పరిసర మండలాల్లో భారీ వర్షం కురిసింది. సాయంత్రం 5 గంటల నుంచి రాత్రి 9 గంటల వరకు చిత్తూరు, గుడిపాల, ఐరాల, బంగారుపాళ్యం, గంగాధరనెల్లూరు, పూతలపట్టు, యాదమరి, తవణంపల్లె, ఎస్ఆర్‌పురం మండలాల్లో ఈదురుగాలులతో కూడిన వర్షం కురిసింది. చిత్తూరు నగరంలో లోతట్టు ప్రాంతాలు జలమయమయ్యాయి. అధిక వర్షానికి మురుగునీటి కాలువలు పొంగిపొర్లడంతో.. వాహనదారులు అవస్థలు పడ్డారు. గ్రామీణ ప్రాంతాల్లో విద్యుత్తు సరఫరాలో తీవ్ర అంతరాయం ఏర్పడింది.

వీధికుక్కలతో భయం.. భయం..!



పుత్తూరు, న్యూస్‌టుడే: పట్టణంలోని అన్ని ప్రాంతాల్లో ఉన్న వీధికుక్కలు పిల్లలపై దాడి చేస్తున్నాయి. పట్టణంలో సుమారు 2 వేలకు పైచిలుకు కుక్కలు ఉన్నాయి. గతంలో వీటి పునరుత్పత్తి జరగకుండా వ్యాక్సినేషన్ చేయించారు. అందులో మిగిలిన వాటి వల్ల సంతతి పెరుగుతోంది. ఒక్కోదానికి గతంలో వ్యాక్సినేషన్‌కు రూ.1350 వరకు ఖర్చయ్యేది. అదికాస్తా ప్రస్తుతం రూ.1750కు పెరిగింది. ఈ నేపథ్యంలో గత మున్సిపల్ కౌన్సిల్ సమావేశంలో రూ.10 లక్షలు కుక్కల వ్యాక్సినేషన్‌కు, వాటి సంరక్షణకు రూ.10 లక్షలు ఖర్చు చేయాలని తీర్మానం చేశారు. అయితే ఒక్కోదానికి రూ.400 వరకు పెంచడంతో ప్రభుత్వానికి మున్సిపల్ అధికారులు లేఖ రాశారు. అక్కడి నుంచి అనుమతి వస్తే తప్ప వాటికి వ్యాక్సినేషన్ వేయించలేని పరిస్థితి. ఈ నేపథ్యంలో ప్రజలు జాగ్రత్తలు తీసుకోవాల్సిందే.

ఇవీ జాగ్రత్తలు..

● ఎనిమిదేళ్ల లోపు పిల్లలను ఒంటరిగా బయటకు పంపరాదు. ● చిన్నారుల చేతిలో ఏమైనా తినుబండారాలు ఉంటే వీధికుక్కలు వాటి కోసం దాడి చేసే అవకాశం అధికంగా ఉందని, పిల్లలకు వాటిని ఇచ్చి బయటకు పంపరాదు. ● దుకాణాల నుంచి వాటిని తెచ్చే సమయంలో జాగ్రత్తగా సంచుల్లో భద్రపరచుకోవాలి.

● పిల్లలు బయటకు వచ్చే సమయంలో పెద్దలు వెంట ఉండాలి. ● పడుకున్న కుక్కలపై చిన్నారులు రాళ్లు విసరడం, కర్రతో కొట్టడం, తోక తొక్కడం, వాటి పిల్లలను తీసుకురావడం చేయరాదు. ● వాహనాలపై వెళ్లే సమయంలో వీధికుక్కలు ఉన్న ప్రాంతాల్లో పెద్దగా శబ్దం చేయడం కానీ, హారన్ మోగించరాదు. ● కుక్కలు వెంట పడితే వేగంగా వెళ్లకుండా నిదానంగా వెళ్తూ వాటిని అదిలించాలి. ● మాంస విక్రయ దుకాణాదారులు వీధి కుక్కలకు మిగిలిన, పనికిరాని మాంసం వేయరాదు. వాటిని ఒక చెత్తబుట్టలో వేసి పారిశుద్ధ్య కార్మికులకు ఇవ్వాలి.

అనుమతి రాగానే చర్యలు చేపడతాం..

కుక్కలు పట్టుకుని టీకాలు వేయడంతో పాటు సంతానోత్పత్తి కలగకుండా శస్త్రచికిత్స చేయించే ప్రక్రియకు అనుమతి వచ్చిన వెంటనే ప్రారంభిస్తాం. కుక్కలు పెంచుకునే వారు వీధుల్లో వదలకుండా ఉండాలి. ప్రజలు అప్రమత్తంగా ఉండాలి.
- మంజునాథగౌడ్, పురపాలిక కమిషనర్, పుత్తూరు

ఆలయంలో పెచ్చులూడిన పైకప్పు

నగరి,న్యూస్‌టుడే: దేశమ్మ ఆలయ ప్రధాన మందిరంలో పైకప్పు సిమెంట్ పూత పెచ్చులూడి పడింది. ఆలయంలో గురువారం ఈ ప్రమాదం చోటు చేసుకుంది. ఆ సమయంలో భక్తులు ఎవరూ లేకపోవడంతో నష్టం వాటిల్లలేదు. గత ఫిబ్రవరిలో ఆలయ జీర్ణోద్ధరణ పనులు పూర్తి చేసి, కుంభాభిషేకం జరుపుకున్న ప్రధాన మందిరంలో ఇలా జరగటంతో నాణ్యతపై అనుమానాలు వ్యక్తం చేస్తున్నారు.

టపాసుల స్వాధీనం.. కేసు నమోదు

పెనుమూరు, న్యూస్‌టుడే: అక్రమంగా నిల్వ చేసిన టపాసులు స్వాధీనం చేసుకుని ఒకరిపై కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు. ప్రకాష్ స్థానిక బీఎస్ఎన్ఎల్ టవర్ సమీపంలోని ఓ ఇంటిలో భారీగా బాణసంచా నిల్వ చేశారు. చిత్తూరు ప్రత్యేక పోలీసులకు సమాచారం అందడంతో గురువారం రాత్రి దాడులు నిర్వహించి రూ.58,500 విలువైన సామగ్రిని స్వాధీనం చేసుకుని స్థానిక పోలీసులకు అప్పగించారు. ఏఎస్సై చక్రవర్తి కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నారు.

హెడ్ కానిస్టేబుల్ సుదర్శన్ మృతి

కార్వేటినగరం, న్యూస్‌టుడే: హెడ్ కానిస్టేబుల్ సుదర్శన్(52) అనారోగ్యంతో బాధపడుతూ శుక్రవారం మృతి చెందారు. ఈయన వెదురుకుప్పం పోలీస్ స్టేషన్‌లో విధులు నిర్వర్తిస్తున్నారు. సాయంత్రం ఆయన మృతదేహానికి పోలీసు లాంఛనాలతో అంత్యక్రియలు జరిపించారు. పలువురు ప్రముఖులు సంతాపం వ్యక్తం చేశారు.

పలమనేరు

•పలమనేరు • కుప్పం •పుంగనూరు

పరిశ్రమల ఏర్పాటుతో యువతకు ఉపాధి

రామకుప్పం, న్యూస్‌టుడే: కుప్పం నియోజకవర్గంలో పరిశ్రమలు ఏర్పాటు చేసి యువతకు బంగారు భవిష్యత్తును కల్పించనున్నట్లు కుప్పం సమన్వయ కమిటీ ఛైర్మన్, ఎమ్మెల్సీ కంచర్ల శ్రీకాంత్, రాష్ట్ర ఆర్టీసీ వైస్ ఛైర్మన్ పీయస్ మునిరత్నం అన్నారు. శుక్రవారం మండలంలోని కెంచనబల్లలో ఇది మంచి ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. కూటమి ప్రభుత్వం ఏర్పడిన 100 రోజుల్లోనే ఇచ్చిన మాట నెరవేర్చిన ఘనత ముఖ్యమంత్రి చంద్రబాబుకే సాధ్యమని అన్నారు. కార్యక్రమంలో ఎస్సీసెల్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు మునస్వామి, మండల అధ్యక్షుడు ఆనందరెడ్డి, నేతలు ఆంజనేయరెడ్డి, నరసింహులు, పత్రనారాయణ, చిన్నిక్రిష్ణ, చలపతి, రామమూర్తి, ఎంపీడీవో ఈశ్వరన్న, తహసీల్దారు బాబు తదితరులు పాల్గొన్నారు.

రేపు విద్యుత్తు సరఫరాలో అంతరాయం

శాంతిపురం, న్యూస్‌టుడే: శాంతిపురం విద్యుత్తు ఉపకేంద్రం పరిధిలో ఈనెల 29 న ఆదివారం విద్యుత్తు అంతరాయం ఏర్పడుతుందని రెస్కో డీఈ హిమ్మత్ సాగర్ తెలిపారు. విద్యుత్తు లైన్ల మరమ్మతుల కోసం ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటలకు వరకు సరఫరాను నిలుపుదల చేయనున్నట్లు పేర్కొన్నారు. వినియోగదారులు సహకరించాలని కోరారు.

కల్లూరు, న్యూస్‌టుడే

సమస్య: మండలంలోని వెంకటదాసరిపల్లె పంచాయతీ చెరకువారిపల్లె గ్రామ సమీపంలోని స్మశాన వాటిక ఎదురుగా ఉన్న 11కేవీ విద్యుత్ తీగలు చేతికి అందే ఎత్తులో ఉన్నాయి. **- స్థానికులు**

సమాధానం: సమస్యను పరిశీలించి వెంటనే లైను బాగు చేసేలా చర్యలు తీసుకుంటాం

- పురుషోత్తం, ఏఈ

సోమల, న్యూస్‌టుడే

సమస్య: మండలంలోని నంజంపేటలో ఆరోగ్య ఉపకేంద్రం సమీపంలో ఉన్న క్రిష్ణాజమ్మకుంట నుంచి దళవాయిచెరువుకు మిగులు జలాలు వెళ్లే కాలువ పిచ్చిమొక్కలతో నిండిపోయింది. **- స్థానికులు**

సమాధానం: ఉపాధి హామీ పథకంలో కాలువ పూడికతీత పనులు మంజూరు అయ్యాయి. త్వరలో పనులు చేపట్టి అసౌకర్యాన్ని తొలగిస్తాం.

- దినకర్‌బాబు ఏపీవో

వెల్‌నెస్ భవనాల వినియోగానికి చర్యలు

శాంతిపురం, న్యూస్‌టుడే: ప్రభుత్వ విలేజ్ హెల్త్ క్లినిక్ భవనాలను వినియోగంలోకి తీసుకొస్తామని జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారిణి ప్రభావతిదేవి శుక్రవారం ప్రకటనలో పేర్కొన్నారు. శాంతిపురం మండల పరిధిలోని పలు వెల్‌నెస్ సెంటర్ల భవనాల నిరుపయోగంపై.. 'రూ.లక్షల వ్యయం.. వినియోగానికి దూరం' శీర్షికన శుక్రవారం 'ఈనాడు'లో ప్రచురితమైన కథనంపై ఆమె స్పందించారు. కెనమాకులపల్లె పంచాయతీలో తగిన వసతులు లేనందున భవనాన్ని వినియోగించలేని పరిస్థితి ఏర్పడిందన్నారు. సమస్యలను వినియోగానికి సత్వర చర్యలు తీసుకుంటామని ఆమె వెల్లడించారు.

అవివాహితులకు సువర్ణావకాశం

ఆర్టీసీ డిపో నిర్వీర్యం

వైకాపా పాలకుల నిర్లక్ష్యమే



పలమనేరు ఆర్టీసీ డిపో

పలమనేరు, న్యూస్‌టుడే: ఒకప్పుడు మంచి ఆదాయం పొందుతున్న పలమనేరు ఆర్టీసీ డిపో ప్రస్తుతం నిర్వీర్యం అయింది. గత వైకాపా పాలకుల నిర్లక్ష్యం పుణ్యమా అని ఆర్టీసీ డిపో నష్టాల బాట పట్టింది. తమిళనాడు, కర్ణాటక రాష్ట్రాల సరిహద్దులో ఉన్న ఈ డిపో నుంచి రాష్ట్రంలోని అన్ని ప్రధాన ప్రాంతాలకు సర్వీసులు తిరిగేవి. అలాగే పక్కనున్న తమిళనాడు, కర్ణాటక రాష్ట్రాలకు ఎక్స్‌ప్రెస్ సర్వీసులు ఉండేవి. వైకాపా ప్రభుత్వం వచ్చిన తరువాత ఇక్కడి బస్సులను రద్దు చేయడమే కాకుండా అప్పట్లో జిల్లాలో పలుకుబడి కలిగిన మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి తన సొంత నియోజకవర్గం పుంగనూరుకు ఇక్కడి నుంచి బస్సులను తీసుకెళ్లిపోయారు.

బస్సులు తరలుతున్నా...

2021లో పుంగనూరులో కొత్తగా డిపోను ఏర్పాటు చేస్తే దాని కోసమని జిల్లాలోని మదనపల్లె, కుప్పం, పలమనేరు, చిత్తూరు డిపోల నుంచి పలు బస్సులను తరలించారు. బస్సులు తరలిపోతున్నా అధికారులు నోరుమెదపలేదు. అప్పట్లో నాయకులకు కూడా ప్రశ్నించే ధైర్యం లేకపోయింది. ఫలితంగా బస్సులు తగ్గి డిపో ఆదాయాన్ని కోల్పోయింది. ఒక్కసారిగా ఇక్కడి నుంచి 13 సర్వీసులను పుంగనూరుకు తరలించారు. ఫలితంగా ఇక్కడి నుంచి తిరుపతి, వేలూరు, నెల్లూరు, శ్రీశైలం, అనంతపురం, హైదరాబాదు, తిరుమల వంటి ప్రాంతాలకు వెళ్లేందుకు సర్వీసులు లేకుండా పోయాయి. దీంతో పలమనేరు సమీపంలోని గ్రామాలకు చెందిన ప్రయాణికులు చిత్తూరు, తిరుపతి డిపోలకు చెందిన బస్సుల మీద ఆధారపడే పరిస్థితి ఏర్పడింది. పైగా పలమనేరుకు బైపాస్ రావడంతో ఎక్స్‌ప్రెస్ బస్సులన్నీ పట్టణంలోకి రావడంలేదు. ఇక ఆటోల్లో బైపాస్ మార్గానికి చేరుకుని ప్రజలు ముఖ్యమైన నగరాలకు, పట్టణాలకు ప్రయాణం చేయాల్సి వస్తోంది.

రద్దయిన ప్రధాన సర్వీసులు

తిరుపతి, మంత్రాలయం, విజయవాడ, హైదరాబాదు, నెల్లూరు, శ్రీహరికోట, శ్రీశైలం, వేలూరు, చెన్నై, బెంగళూరు.

నష్టనివారణ చర్యలు

ఇక్కడి నుంచి వెళ్లిన సర్వీసులను తిరిగి పునరుద్ధరించాలని ఎమ్మెల్యే అమరనాథరెడ్డి అధికారులను కోరారు. ఆ మేరకు ఆయన ఒక నివేదికను అధికారులకు సమర్పించారు. నష్ట నివారణ చర్యలు తీసుకోవాలని నివేదికలో కోరారు. ఇక్కడ రద్దయిన సర్వీసులను తిరిగి ప్రారంభించాలని అధికారులకు సూచించారు. ఆ మేరకు అధికారులు చర్యలు మొదలుపెట్టారు.

సామర్థ్యం లేని బస్సులే..

ఒకప్పుడు పలమనేరు డిపోలో 75 బస్సులు ఉండేవి. ఇప్పుడు వాటి సంఖ్య 50కి పడిపోయింది. వాటిల్లో కూడా చాలా వరకు నాణ్యతలేని బస్సులే ఉండడంతో ఎక్కడ పడితే అక్కడ ఆగిపోతున్నాయి. గత రెండు నెలల వ్యవధిలో పది చోట్ల ఆర్టీసీ బస్సులు రోడ్లమీద నిలిచి పోవడంతో ప్రయాణికులు అవస్థలు పడిన సందర్భాలు అనేకం. ఒకప్పుడు ఇక్కడి నుంచి మదనపల్లె-చిత్తూరు మార్గంలో లైట్నింగ్ సర్వీసులు ఎంతో విజయవంతంగా నడిచేవి. ఇప్పుడు అవన్నీ రద్దవడంతో డిపో ఆదాయం పడిపోయింది. ప్రస్తుతం రోజుకు రూ.7 లక్షల ఆదాయం వస్తోంది. వైకాపా ప్రభుత్వం అధికారంలోకి రాకముందు పలమనేరు డిపోలో ఎక్కువ సంఖ్యలో బస్సులు ఉండటంతో రోజుకు రూ.12 లక్షల వరకు ఆదాయం వచ్చేది.

టెండర్లు పిలుస్తాం

పలమనేరు డిపోలో తిరిగి పాత ఎక్స్‌ప్రెస్ సర్వీసులను నడిపేందుకు అద్దె బస్సుల కోసం టెండర్లు పిలుస్తున్నాం. రద్దయిన బస్సులు నడపడానికి ప్రయత్నం చేస్తున్నాం. మేమిచ్చిన టెండర్ల ద్వారా ప్రస్తుతానికి 4 కొత్త అద్దె బస్సులు వచ్చాయి. ఇంకో 10 వరకు రావాల్సి ఉంది. కర్ణాటక రాష్ట్రం ముళబాగల్, కోలారు నగరాలకు కూడా సర్వీసులను నడిపేందుకు చర్యలు తీసుకుంటున్నాం.

- టి.కె.స్వామి, ఆర్టీసీ డిపో మేనేజరు, పలమనేరు

ఘనంగా ద్రౌపది కల్యాణోత్సవం



ద్రౌపది కల్యాణోత్సవాన్ని జరిపిస్తున్న అర్చకులు

సదుం: స్థానిక బట్టువారిపల్లె గ్రామంలో నిర్వహిస్తున్న మహాభారతం యజ్ఞంలో భాగంగా శుక్రవారం ద్రౌపది కల్యాణోత్సవం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ద్రౌపది అమ్మవారికి సారె ఊరేగింపుగా తీసుకువచ్చి అర్చకులు భాస్కర్‌శర్మ ఆధ్వర్యంలో కల్యాణోత్సవాన్ని శాస్త్రోక్తంగా జరిపించారు. పాండవుల ఉత్సవ విగ్రహాలకు ప్రత్యేక పూజలు చేశారు. పూజల్లో ఉభయదారులు, భక్తులు పాల్గొన్నారు.

అమ్మవారి ఆలయంలో ప్రాయశ్చిత్త శాంతి హోమం



హోమం నిర్వహిస్తున్న ఈవో, అర్చకులు

బోయకొండ(చౌడేపల్లె), న్యూస్‌టుడే: బోయకొండ గంగమ్మ ఆలయంలో శుక్రవారం ప్రాయశ్చిత్త శాంతి హోమం నిర్వహించారు. దేవాదాయ శాఖ కమిషనర్ ఉత్తర్వులు మేరకు చేపట్టిన ఈ హోమం ఉదయం 8 గంటలకు ప్రారంభమై రెండు గంటల పాటు వేదపండితులు నిర్వహించారు. ఈవో ఏకాంబరం, భక్తులు పాల్గొన్నారు.

క్రమశిక్షణకు మారుపేరు ఎన్‌సీసీ

పుంగనూరు గ్రామీణ, న్యూస్‌టుడే: క్రమశిక్షణకు మారుపేరు.. భవితకు భరోసా ఎన్‌సీసీ అని బీఎన్ 35 చిత్తూరు ఏఓ లోకనాథం తెలిపారు. శుక్రవారం స్థానిక శుభారాం ప్రభుత్వ జూనియర్ డిగ్రీ కళాశాలలో ఎన్‌సీసీ విద్యార్థులకు బి ధ్రువపత్రాలు అందజేశారు. ప్రతి విద్యార్థి చదువుతో పాటు సమాజ సేవలో పాల్గొనాలని అన్నారు. కళాశాల ఆవరణలో మొక్కలు నాటారు. కార్యక్రమంలో ప్రిన్సిపల్ రాజశేఖర్, ఎన్‌ఎస్‌ఎస్ అధికారి సోమరాజు, విద్యార్థులు పాల్గొన్నారు.

ప్రజలకు మెరుగైన సేవలందిస్తాం



ఆర్టీసీ రాష్ట్ర వైస్ ఛైర్మన్ పీఎస్ మునిరత్నంను సన్మానిస్తున్న ఎమ్మెల్సీ కంచర్ల శ్రీకాంత్

కుప్పం పట్టణం, న్యూస్‌టుడే: ఆర్టీసీ ద్వారా ప్రజలకు మెరుగైన రవాణా సౌకర్యం అందించేందుకు కృషి చేస్తామని ఆర్టీసీ రాష్ట్ర వైస్ ఛైర్మన్, తెదేపా నియోజకవర్గ ఇన్‌ఛార్జి పీఎస్ మునిరత్నం అన్నారు. స్థానిక తెదేపా కార్యాలయంలో శుక్రవారం ఆర్టీసీ వైస్ ఛైర్మన్‌గా ఎంపికైన ఆయనను ఎమ్మెల్సీ కంచర్ల శ్రీకాంత్, పార్టీ శ్రేణులు ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో నాయకులు గోపీనాథ్, ప్రేమ్‌కుమార్, రాజ్‌కుమార్, సత్యేంద్రశేఖర్ తదితరులు ఉన్నారు.

అనేక పర్యాయాలు వచ్చారు



సమావేశంలో పాల్గొన్న వెంకటేగౌడ

పలమనేరు, న్యూస్‌టుడే: గతంలో అనేక పర్యాయాలు తిరుమల దర్శనానికి వచ్చిన జగన్‌మోహన్‌రెడ్డిని ఇప్పుడు డిక్లరేషన్ అడగటం సబబు కాదని పలమనేరు మాజీ ఎమ్మెల్యే వెంకటేగౌడ అన్నారు. శుక్రవారం ఆయన స్థానిక పార్టీ కార్యాలయంలో కార్యకర్తల సమావేశంలో పాల్గొన్నారు. వైకాపా నాయకులను పోలీసులు గృహనిర్బంధం చేయడం తగదన్నారు. కార్యక్రమంలో మాజీ ఎంపి రెడ్డెప్ప, నాయకులు మండి సుధాకర్ పాల్గొన్నారు.

బదిలీ అయిన ఏఈకి సన్మానం

పుంగనూరు: చౌడేపల్లె ఏపీఎస్పీడీసీఎల్ ఏఈగా బదిలీ అయిన పట్టణ ఏఈ శశిధర్‌ను శుక్రవారం కార్యాలయ ఆవరణలో సిబ్బంది ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అందరి సహకారంతో మండలంలో వినియోగదారులకు మెరుగైన సేవలు అందించినట్లు తెలిపారు.

పర్యావరణ పరిరక్షణ మనందరి బాధ్యత

సదుం, న్యూస్‌టుడే: పర్యావరణ పరిరక్షణ మనందరి బాధ్యతని స్థానిక జడ్పీఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయుడు జయకుమార్‌రెడ్డి అన్నారు. స్వచ్ఛత హీ సేవ కార్యక్రమంలో భాగంగా ఎన్‌జీసీ విద్యార్థులతో కలసి స్థానిక పచ్చార్లవంక ప్రాజెక్టును సందర్శించి విత్తనాలు నాటారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు అమర్‌నాద్, వెంకట్రామణారెడ్డి, రెడ్డిరాణి, కుమారి, ఆంజనేయులు తదితరులు పాల్గొన్నారు.

పేదల కాలనీల్లో వసతులు కల్పించాలి

పలమనేరు: పట్టణంలోని పేదల కాలనీల్లో ప్రభుత్వం వసతులు కల్పించాలని సిపిఎం రాష్ట్ర నాయకులు దడాల సుబ్బారావు డిమాండు చేశారు. శుక్రవారం పట్టణంలోని సీపీఎం కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ ప్రధానంగా పట్టణానికి సమీపంలోని షికారి కాలనీల్లో వీధి దీపాలు ఏర్పాటుచేసి తాగునీటి సమస్యను పరిష్కరించాలని కోరారు. ఇంకా అసంఘటిత రంగ కార్మికుల సమస్యలను పరిష్కరించాలన్నారు. కార్యక్రమంలో నాయకులు గిరిధరగుప్త, ఈశ్వరయ్య, హైదర్‌ఖాన్, శేఖర్ పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి పోటీలకు విద్యార్థుల ఎంపిక



ఎంపికైన విద్యార్థులతో ఉపాధ్యాయ బృందం

కుప్పం గ్రామీణ, న్యూస్‌టుడే: మండల పరిధి టి.సదుమూరు జడ్పీ ఉన్నత పాఠశాలకు చెందిన మంజుశ్రీ అండర్-17 అథ్లెటిక్ 800 మీటర్ల పరుగు పందెంలో మొదటి స్థానంలో నిలవగా... కోకిల 1500 మీటర్ల పరుగు పందెంలో ద్వితీయ స్థానం సాధించి రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికైనట్లు ప్రధానోపాధ్యాయులు పద్మనాభరాజు, పిడి ప్రకాష్ తెలిపారు.



మాట్లాడుతున్న తెదేపా అధ్యక్షుడు టీఎం బాబు

ప్రతి కుటుంబానికి సంక్షేమ పథకాలు అందాలి

గుడుపల్లె, న్యూస్‌టుడే: ఎన్డీయే ప్రభుత్వ పాలనలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అమలు చేస్తున్న పేదరిక నిర్మూలనా సంక్షేమ పథకాలను ప్రతి పేదింటికీ అందించేందుకు అంకితభావంతో పనిచేయాలని వెలుగు అధికార, క్షేత్రస్థాయి సంఘమిత్ర సభ్యులకు టీఎం బాబు సూచించారు. గురువారం వెలుగు సమావేశ మందిరంలో ఏపీఎం గ్రీటా ఆధ్వర్యంలో జరిగిన సమావేశంలో ఆయన పాల్గొన్నారు. మండలంలో దాదాపుగా 14 వేల కుటుంబాలు తెల్లరేషన్ కార్డుదారులు ఉన్నారని తెలిపారు. అందరికీ సంక్షేమ పథకాలు అందించాలని చెప్పారు. ఎంపీడీఓ తాజ్‌మస్రూర్, ఏఎస్వో రాధాకృష్ణ, అధికారులు, నాయకులు పాల్గొన్నారు.

వైకాపా ప్రజాప్రతినిధులకు నోటీసులు

పుంగనూరు, న్యూస్‌టుడే: వైకాపా అధినేత జగన్‌మోహన్‌రెడ్డి పిలుపు మేరకు తిరుపతి పర్యటన సందర్భంగా శాంతిభద్రతలను దృష్టిలో ఉంచుకుని పుంగనూరు నుంచి వైకాపా ప్రజాప్రతినిధులు, నాయకులు వెళ్లకుండా శుక్రవారం స్థానిక పోలీసులు నోటీసులు ఇచ్చారు. పురపాలక ఛైర్మన్ అలీం బాషా, వైస్‌ఛైర్మన్ నాగేంద్ర, కౌన్సిలరు అమ్ములు, పార్టీ నాయకులు నోటీసులు అందుకున్నారు. తిరుపతి జిల్లాలో పోలీస్‌యాక్ట్ అమలులో ఉన్నందున నాయకులు పోలీసులకు సహకరించాలని నోటీసులో కోరారు.

ప్రజా సంక్షేమంలో మంచి ప్రభుత్వం



మాట్లాడుతున్న ఎమ్మెల్సీ కంచర్ల శ్రీకాంత్, పురపాలిక కమిషనర్ శ్రీనివాసరావు

కుప్పం పట్టణం, న్యూస్‌టుడే: రాక్షస పాలనను అంతం చేసి ప్రజలు మంచి ప్రభుత్వానికి పట్టంకట్టి వంద రోజులు పూర్తి కావడంతో రాష్ట్ర ప్రజలు సంబరాలు చేసుకుంటున్నారని ఎమ్మెల్సీ కంచర్ల శ్రీకాంత్ అన్నారు. పురపాలిక పరిధిలోని 17,18 వార్డులకు సంబంధించి నారాయణస్వామి వీధిలో ఇది మంచి ప్రభుత్వం కార్యక్రమాన్ని శుక్రవారం నిర్వహించారు. వంద రోజుల్లో పింఛన్ పెంచి వృద్ధులు, ప్రత్యేక ప్రతిభావంతులకు భరోసా ఇచ్చిందని వెల్లడించారు. మెగా డీఎస్సీ విడుదల చేసి నిరుద్యోగుల జీవితాల్లో కూటమి ప్రభుత్వం వెలుగులు నింపిందన్నారు. రాబోయే రోజుల్లో అభివృద్ధి, సంక్షేమం రెండంకెల అభివృద్ధి రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు నాయకత్వంలో రాష్ట్రం సాధిస్తుందని అన్నారు. కార్యక్రమంలో పురపాలిక కమిషనర్ శ్రీనివాసరావు, కౌన్సిలర్లు దాము, సోము, నాయకులు గోపీనాథ్, రాజ్‌కుమార్, మంజు, వేలు, భాగ్యలక్ష్మీ, ఆర్ముగం తదితరులు ఉన్నారు.

తల్లీబిడ్డల సంరక్షణే ఐసీడీఎస్ లక్ష్యం

సదుం, న్యూస్‌టుడే: తల్లి, బిడ్డల సంరక్షణే ఐసీడీఎస్ లక్ష్యమని అంగన్‌వాడీ పర్యవేక్షకురాలు మల్లీశ్వరి అన్నారు. శుక్రవారం స్థానిక ఎంపీడీవో కార్యాలయ ఆవరణలో అంగన్‌వాడీ పౌష్టికాహార మాసోత్సవాల్లో భాగంగా వివిధ రకాల ఆహార పదార్థాలను తయారుచేసి ప్రదర్శించారు. అంగన్‌వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

దోమల నిర్మూలనకు చర్యలు

శాంతిపురం, న్యూస్‌టుడే: గ్రామాల్లో సంపూర్ణ పారిశుధ్యంలో భాగంగా దోమల నిర్మూలనకు చర్యలు చేపడుతున్నట్లు ఎంపీడీఓ కుమార్, ఈఓపీఆర్‌డీ రవినాయక్ తెలిపారు. కెనమాకులపల్లె, చిన్నారిదొడ్డి పంచాయతీల పరిధిలో శుక్రవారం ఫాగింగ్ చేపట్టారు.



చిన్నారిదొడ్డిలో ఫాగింగ్ చేపడుతున్న దృశ్యం

పర్యాటక రంగం అభివృద్ధితోనే ప్రగతి



ర్యాలీలో పాల్గొన్న ఉపాధ్యాయులు, విద్యార్థులు

కల్లూరు: పర్యాటక రంగం వ్యక్తుల మధ్య పరస్పర అవగాహన ప్రాంతాల మధ్య శాంతిని ప్రోత్సహిస్తుందని, వివిధ ప్రాంతాల చరిత్ర, వివిధ ప్రాంతాల్లో మాట్లాడే బాషలు, వేషధారణ, సంస్కృతి, సంప్రదాయాలు వెలుగులోకి వస్తాయని కల్లూరు హైస్కూల్ ప్రధానోపాధ్యాయురాలు శ్రీవాణి తెలిపారు. శుక్రవారం ప్రపంచ పర్యాటక దినోత్సవ సందర్భంగా విద్యార్థులు, ఉపాధ్యాయులు ర్యాలీని చేపట్టారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు వెంకటసిద్ధులు, రాజేంద్ర, వేణుగోపాల్, స్నేహమాలిని, ఈశ్వరయ్య తదితరులు పాల్గొన్నారు.


అన్ని మతాలు సమానమే



పుంగనూరులో ర్యాలీ నిర్వహిస్తున్న జనసేన నాయకులు

పుంగనూరు, న్యూస్‌టుడే: జనసేన అధినేత, రాష్ట్ర ఉపముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్‌కు అన్ని మతాలు సమానమేనని జనసేన పుంగనూరు నియోజకవర్గ ఇన్‌ఛార్జి చిన్నరాయల్, సీనియర్ నాయకుడు సీవీ శ్రీనివాసులు అన్నారు. పవన్‌కల్యాణ్ చేపట్టిన ప్రాయశ్చిత్త దీక్షకు మద్దతుగా శుక్రవారం స్థానిక కల్యాణ వెంకటరమణ స్వామి ఆలయంలో స్వామివారికి అభిషేకం చేసి ర్యాలీ నిర్వహించారు. ర్యాలీలో జనసేన పార్టీ నాయకులు పాల్గొన్నారు.

పచ్చదనం నేలకూలుతోంది



ట్రాక్టర్‌లో తరలిస్తున్న కలప

కుప్పం పట్టణం, న్యూస్‌టుడే: పర్యావరణ పరిరక్షణకు పచ్చదనం పెంచాలంటూ అధికారులు ఓ వైపు సభల్లో ఉపన్యాసాలు ఇస్తూ.. అవగాహన ర్యాలీ చేపడుతూ.. అవగాహన కల్పిస్తున్నామని అధికారులు ఓ వైపు చెపుతున్నా క్షేత్రస్థాయిలో ఆ ఫలితాలు కనిపించడం లేదు. చెట్టు కనిపిస్తే చాలు అక్రమార్కులకు కల్పవృక్షంలా మారుతోంది. భారీ వృక్షాలపై కన్నుపడితే అక్రమారులు గొడ్డలి వేటుతో నేలకూల్చి పచ్చదనాన్ని నాశనం చేస్తున్నా అటు అటవీ అధికారులు.. ఇటు రెవెన్యూ అధికారులు చూసీచూడనట్లు వ్యవహరిస్తుండటంతో పచ్చదనం ప్రశ్నార్థకంగా మారింది. కుప్పం పట్టణంలో శుక్రవారం అక్రమంగా వృక్షాలను నరికి ట్రాక్టర్ ద్వారా తరలిస్తున్న ఫోటోలు సామాజిక మాధ్యమాల్లో వైరల్‌గా మారింది. ఈ విషయమై అటవీ రేంజర్ జయశంకర్‌ను వివరణ కోరగా, రైతుల పొలాల్లో పెంచుకున్న అకేషియా చెట్లను పెంచుతారు. అటవీ, రెవెన్యూ అధికారుల నుండి అనుమతులు తీసుకోవాలి. దీనిపై విచారణ చేపట్టి, అనుమతులు లేకుండా చెట్లను కూల్చితే కఠిన చర్యలు తీసుకుంటామన్నారు.

మౌలిక వసతులు కల్పించాలని వినతి



ఏపీ టిడ్కో ఛైర్మన్ అజయ్‌ను కలిసిన జనసేన నాయకులు

పుంగనూరు, న్యూస్‌టుడే: పుంగనూరులో నిర్మించిన టిడ్కో ఇళ్ల సముదాయాల వద్ద లబ్ధిదారులకు అవసరమైన మౌలిక వసతులు పూర్తిస్థాయిలో కల్పించాలని ఏపీ టిడ్కో ఛైర్మన్ అజయ్‌కి శుక్రవారం స్థానిక జనసేన నాయకులు పగడాల రమణ, విరూపాక్షి వినతి పత్రం అందించారు. విజయవాడలో ఆయన కార్యాలయంలో కలిసిన నాయకులు అరకొర వసతుల మధ్య లబ్ధిదారులకు ఇళ్లు కేటాయించడంతో పాతిక శాతం మంది మాత్రమే నివసిస్తున్నారని వివరించారు. సానుకూలంగా స్పందించిన ఆయన క్షేత్రస్థాయి పర్యటన జరిపి పూర్తిస్థాయి నివేదికను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి వసతులు కల్పిస్తామని హామీ ఇచ్చారన్నారు. కార్యక్రమంలో నాయకులు నరేష్, నాగభూషణం పాల్గొన్నారు.

ఆర్డీవో మనోజ్‌రెడ్డి బదిలీ



పలమనేరు, న్యూస్‌టుడే: పలమనేరు ఆర్డీవో మనోజ్‌రెడ్డిని ప్రభుత్వం బదిలీ చేస్తూ గురువారం రాత్రి ఉత్తర్వులు జారీ చేసింది. కడప నగర పాలక కమిషనర్‌గా నియమిస్తూ ఉత్తర్వుల్లో పేర్కొన్నారు. గత అసెంబ్లీ ఎన్నికల సందర్భంగా ఆయన ఇక్కడికి వచ్చారు. పరిశ్రమలు వాణిజ్యశాఖ మంత్రి టీజీ భరత్ వద్ద ఓఎస్డీగా ఉన్న వెంకటేష్‌ను పలమనేరు ఆర్డీవోగా ప్రభుత్వం బదిలీ చేసింది.

బాధ్యతల స్వీకరణ



సర్వేశ్వరరెడ్డి

పుంగనూరు, న్యూస్‌టుడే: స్థానిక సబ్ రిజిస్ట్రార్‌గా సర్వేశ్వర్‌రెడ్డి శుక్రవారం బాధ్యతలు తీసుకున్నారు. ఇక్కడ పనిచేస్తున్న బాలాజి శ్రీకాళహస్తికి బదిలీ కాగా బంగారుపాళ్యంలో పనిచేస్తున్న సర్వేశ్వర్‌రెడ్డి ఇక్కడకు బదిలీ అయ్యారు. నూతనంగా బాధ్యతలు చేపట్టిన సబ్ రిజిస్ట్రార్‌ను కార్యాలయ సిబ్బంది కలిశారు.



ఏఈ శశిధర్

చౌడేపల్లె, న్యూస్‌టుడే: మండల ట్రాన్స్‌కో ఏఈఈగా పుంగనూరులో విధులు నిర్వహించిన శశిధర్ శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. గతంలో ఇక్కడ పనిచేసిన ఏఈఈ రాజశేఖర్ రెడ్డి వాల్మీకిపురానికి బదిలీ కావడంతో శశిధర్‌ను నియమించారు. రైతులు, అధికారులు ఆయన స్వాగతం పలికారు.

అంతర్ జిల్లాల పోటీలకు విద్యార్థుల ఎంపిక

సదుం: మండలంలోని బీసీ మహాత్మాజ్యోతిబపూలే గురుకుల పాఠశాలకు చెందిన ఇద్దరు విద్యార్థులు అంతర్ జిల్లాల పోటీలకు ఎంపికైనట్లు ప్రిన్సిపల్ శ్రీనివాసులురెడ్డి తెలిపారు. చిత్తూరులో జరిగిన అండర్-17 వాలీబాల్ పోటీల్లో ఇంటర్మీడియట్ విద్యార్థి లోహిత్‌కుమార్ వాలీబాల్ పోటీల్లో, 9వతరగతి విద్యార్థి మహేంద్రనాయుడు, రన్నింగ్, లాంగ్‌జంప్, అథ్లెటిక్స్‌లో ప్రతిభ కనబరచినట్లు చెప్పారు. వచ్చే నెలలో శ్రీకాకుళంలో జరిగే అంతర్ జిల్లాల పోటీల్లో పాల్గొంటారని తెలిపారు. వీరిని ఉపాధ్యాయులు అభినందించారు.

సంఘాలు.. ఎన్నికలు

గంగవరం, న్యూస్‌టుడే: మండల నోబుల్ టీచర్స్ అసోసియేషన్ కార్యవర్గాన్ని శుక్రవారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. మండల కేంద్రంలో జరిగిన కార్యవర్గ ఎన్నికల్లో మండల నోబుల్ టీచర్స్ అసోసియేషన్ అధ్యక్షులుగా శంకర, ఉపాధ్యక్షురాలుగా విజయ, గౌరవ అధ్యక్షులుగా రామకృష్ణ, ప్రధాన కార్యదర్శిగా గణేష్, కార్యదర్శిగా లక్ష్మీ, ఉపకార్యదర్శిగా సూర్యప్రకాష్, జిల్లా ఉపాధ్యక్షులుగా ఏఆర్ కుమార్‌ను ఎన్నుకున్నారు. ఎన్నికల పర్యవేక్షకులుగా రాష్ట్ర ఉపాధ్యక్షులు రెడ్డిరమేష్, జిల్లా అధ్యక్షులు జయప్రకాష్‌నాయుడు, కార్యదర్శి రామయ్య వ్యవహరించారు.

ద్విచక్ర వాహనానికి నిప్పు

రామకుప్పం, న్యూస్‌టుడే: గుర్తు తెలియని వ్యక్తులు ద్విచక్ర వాహనానికి నిప్పు పెట్టి పరారైన సంఘటన మండల కేంద్రం రామకుప్పంలో గురువారం అర్ధరాత్రి చోటు చేసుకుంది. స్థానికుల వివరాల మేరకు రాత్రి రామాలయం పక్కనే అసంపూర్తిగా ఉన్న కమ్యూనిటీ భవనంలో ద్విచక్ర వాహనానికి గుర్తు తెలియని వ్యక్తులు నిప్పు పెట్టారు. స్థానికులు గుర్తించి మంటలను ఆర్పే ప్రయత్నం చేయగా ద్విచక్ర వాహనం పూర్తిగా దగ్ధమైంది. పోలీసులను వివరణ కోరగా తమకు ఎటువంటి ఫిర్యాదు అందలేదని తెలిపారు.